



సంచలన వార్తలకు
# నేడు
TELUGU DAILY

ఆదివారం | 13.07.2025 | సంపుటి : 3 | సంచిక :76 | పేజీలు : 8 | వెల : 2/- | www.nedudailynews.com



మీ టీవీ ఇక కంప్యూటర్‌గా.. 08



03

## మావోలకు భారీ ఎదురుదెబ్బ


23మంది మావోల లొంగుబాటు

## సెకన్ పాటు ఆగిపోయిన ఇంధన స్విచ్‌లు

- ప్రమాదం వెనుక ఎలాంటి కుట్రకోణం లేదు
- పక్షి ఢీకొన్న ఆనవాళ్లు అసలే లేవు
- ఎయిరిండియా ప్రమాదంపై 15పేజీల ప్రాథమిక నివేదిక



04



## శ్రీశైలం దారిలో భారీగా ట్రాఫిక్ జామ్

12 కిలోమీటర్ల మేర నిలిచిన వాహనాలు 03

## రాజకీయాలు చాలా కాస్ట్‌లీ..

- నిజాయితీగా పనిచేసే ఎంపీలకు జీతం సరిపోవట్లేదు
- సొంత డబ్బును ఉపయోగించి సమస్యను పరిష్కరించండి అంటున్నారు
- ఎంపీ కంగనా రనౌత్



07



## 15 దఫాల్లో 10 లక్షల ఉద్యోగాలు

- వికసిత భారత్‌లో యువత పాత్ర కీలకం
- కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి కిషన్‌రెడ్డి

02



# న్యాయవాద వృత్తిలో కఠిన సవాళ్లు

- చేసే వృత్తిని, చేసే పనిని ప్రేమించగలగాలి
- కోర్టు తీర్పులపై సమగ్ర అవగాహనతో ఉండాలి
- న్యాయవ్యవస్థలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు ఇదే ఛాన్స్
- విదేశీ విద్య.. నైపుణ్యానికి ప్రామాణికం కాదు
- దేశంలో పీజీ విద్య, పరిశోధనల్లో నాణ్యత పెంపొందించాలి
- 'నల్సార్' స్నాతకోత్సవంలో సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్

న్యాయవాద వృత్తి ఎన్నో సవాళ్లతో కూడుకున్నదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ అన్నారు. వృత్తిని, చేసే పనిని ప్రేమించాలి. అప్పుడే సరైన ఫలితాలు పొందగలుగుతాం. ప్రస్తుతం న్యాయవ్యవస్థలో ఎన్నో సవాళ్లు ఉన్నాయి. కొన్ని కేసుల విచారణ దశాబ్దాల పాటు సాగటం ఆందోళనకరం అని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని నల్సార్ లా యూనివర్సిటీలో 22వ స్నాతకోత్సవం శనివారం ఘనంగా జరిగింది. హైదరాబాద్ నల్సార్ యూనివర్సిటీ స్నాతకోత్సవ కార్యక్రమానికి జస్టిస్ బీఆర్ గవాయ్, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ పీఎస్ నరసింహ, హైకోర్టు సీజే జస్టిస్ సుజయ్‌పాల్ తదితరులు హాజరయ్యారు.

హైదరాబాద్, జులై 12 : విదేశీ విద్య నైపుణ్యానికి ప్రామాణికం కాద ని.. బ్రాండ్ పేరుతో, ఒత్తిళ్లతోనో అక్కడికి వెళ్లరాదని, ఓ లక్ష్యాన్ని నిర్దేశించుకుని వెళ్లాల ని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ బి.ఆర్. గవాయ్ అన్నారు. మన దేశం లో పీజీ విద్యాభ్యాసం, పరిశోధన అవకాశాల పై నమ్మకం లేకపోవడం వల్ల పలువురు విదే శాలకు వెళ్తున్నారని వ్యాఖ్యానించారు. దేశ న్యాయవ్యవస్థ ప్రయోజనాల పరిరక్షణకు, అత్యుత్తమ న్యాయవాదులను తీర్చిదిద్దేందుకు పీజీ విద్య, పరిశోధనల్లో ఎక్కువ పెట్టుబడి పెట్టాల్సిన అవసరముందని ఆయన పేర్కొన్నారు.

మిగతా 2 లో



## 2029 ఎన్నికల్లో ప్రధాన ఎజెండా బీసీ రిజర్వేషన్లే

- అన్ని రాష్ట్రాల్లో అమలైతేనే నిజమైన విజయం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

02

## 3.58 లక్షల కొత్త కార్డుల జారీ



- 95.56 లక్షలకు చేరిన కార్డులు
- 3.09 కోట్ల మంది లబ్ధిదారులు
- మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి



02

పేదలకు రేషన్ పథకంలో రాష్ట్రం సరికొత్త మైలురాయికి చేరుకుందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. జులై 14 నాటికి రాష్ట్రంలో మొత్తం రేషన్‌కార్డుల సంఖ్య 95,56,625కి.. లబ్ధిదారుల సంఖ్య 3,09,30,911కి పెరగనుందని తెలిపారు. ఆహారభద్రతలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం తిరుమలగిరిలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొనే సభలో కొత్త కార్డుల పంపిణీ జరుగుతుందన్నారు. ఈ మేరకు శనివారం ఉత్తమ్ ఓ ప్రకటన విడుదల చేశారు.



07

## భూమికి తిరిగొచ్చాక శుభాంశు శుక్లాకు క్వారంటైన్



07

## వీసా వస్తే సరిపోదు..

'బహిష్కరణ ముప్పు'పై అమెరికా వార్నింగ్

## కవిత బిసి రిజర్వేషన్ ఉద్యమం చేశారా

- ఎందుకీ తీన్మార్ స్టెప్పులు వేస్తున్నారో
- మద్యం కుంభకోణంతో తెలంగాణ పరువు తీసిన కవిత
- కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

మద్యం కుంభకోణంతో జైలులో ఉన్న తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత బిసి రిజర్వేషన్ల కోసం ఎప్పుడు ఉద్యమం చేశారని కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. బిసి రిజర్వేషన్ల కోసం తాను ఉద్యమించినందునే రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ కోసం సిద్ధమైందని కవిత చెబుతూ తీన్మార్ డాన్సులు చేస్తున్నదని ఆయన ధ్వజమెత్తారు.



02



## కాంగ్రెస్ ప్రభుత్వానిది ప్రచారార్భాటం

- స్కూటీలు, పెళ్లికి లక్ష నగదు, తులం బంగారం ఏవీ?
- ప్రభుత్వంపై ఎమ్మెల్సీ కవిత విమర్శలు

03

ఈ ప్రభుత్వం ప్రజలకు సేవ చేయడం కంటే ప్రచారానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు.ఎన్నికల ముందు అమ్మాయిలకు స్కూటీలు, పెళ్లికి లక్ష రూపాయల నగదు, తులం బంగారం ఇస్తామని చేసిన హామీల్లో ఏ ఒక్కదాన్ని కూడా ఈ ప్రభుత్వం నెరవేర్చలేదని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు.

## రవాణా శాఖలో విప్లవాత్మక మార్పులు

- వాహనాల ఫిట్‌నెస్, డ్రైవింగ్‌పై అవగాహన
- మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి

తెలంగాణలో రవాణా శాఖలో విప్లవాత్మక మార్పులు తెచ్చామని మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. వాహనాల ఫిట్‌నెస్, డ్రైవింగ్‌పై అవగాహన లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పుకొచ్చారు. శనివారం నల్లగొండలో మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు.



03

# న్యాయవాద వృత్తిలో కఠిన సవాళ్లు

(మొదటిపేజీ తరువాయి)

అప్పులు చేసి పంపిస్తున్న కుటుంబాలు వాటిని తీర్చలేక ఇబ్బందులు ఎదుర్కొంటాయి. దానికంటే కొద్దిపాటి పెట్టుబడితో ఇక్కడే ప్రాక్టీస్ ప్రారంభించి, కొంత ఆర్జించిన తర్వాత విదేశాలకు వెళ్లి చదువుకోవచ్చు.

### న్యాయవాద వృత్తి సులభమైంది కాదు...

న్యాయవాద వృత్తి పవిత్రమైంది. అయితే, అంత సులభమైంది కాదు. కఠిన సవాళ్లుంటాయి. ఆదాయంపై హామీ ఉండదు. కోర్టుల ముందు, కక్షిదారుల ముందు ఎప్పటికప్పుడు రుజువు చేసుకోవాల్సి వస్తుంది. ఉన్నత నైపుణ్యాలతోనే కాకుండా సృజనాత్మక, నిర్మాణాత్మక ఆలోచనలతో రాణించవచ్చు. గంటల తరబడి పనిచేయాల్సి ఉంటుంది. ప్రపంచీకరణ నేపథ్యంలో నైపుణ్యంతో సంబంధం లేకుండా జాతీయ న్యాయ విశ్వవిద్యాలయాల నుంచి వచ్చేవారికి చిన్న యూనివర్సిటీల నుంచి వచ్చేవారి కంటే మంచి స్థానాలు లభిస్తున్నాయి. ఇది అనుచితమైనప్పటికీ వాస్తవం. న్యాయవాద వృత్తిలో అడ్డదారులుండవు. నిరంతర అధ్యయనంతోనే విజయం సాధ్యమవుతుంది. రాజ్యాంగం, సివిల్ లా, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, కాంట్రాక్ట్ లా వంటి చట్టాల గురించి తెలుసుకోవాలి. కుటుంబం, స్నేహితులు, పుస్తకాలు, కార్యాల యం, ఆరోగ్యం, ఊహాశక్తి అనే అంశాలను ఎప్పుడూ విస్మరించకూడదు.

### కేసుల విచారణలో అసాధారణ జాప్యం...

న్యాయవ్యవస్థలో అనేక సవాళ్లున్నాయి. కేసుల విచారణలో అసాధారణ జాప్యం జరుగుతోంది. పరిష్కారానికి దశాబ్దాలు పడుతున్నాయి. అమాయకులు విచారణ ఖైదీలుగా జైళ్లలో మగ్గిపోతున్నారు. ఈ సమస్య పరిష్కారానికి నిపుణులు కృషి చేయాలి" అని జస్టిస్ గవాయ్ అన్నారు. కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.ఎస్.నరసింహ, హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి, నల్సార్ ఛాన్సలర్ జస్టిస్ సుజయ్‌పాల్, యూనివర్సిటీ వీసీ శ్రీకృష్ణదేవ రావు, కేంద్ర సామాజిక న్యాయం, సాధికారతశాఖ కార్యదర్శి అమిత్ యాదవ్, పలువురు న్యాయమూర్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు పుస్తకాలను సీజేఐ, నల్సార్ లా జర్నల్‌ను సీఎం ఆవిష్కరించారు. ఎల్ఎల్‌బీతోపాటు పలు డిగ్రీల్లో ఉత్తీర్ణులైన సుమారు 450 మందికి స్నాతకోత్సవంలో పట్టాలు ప్రదానం చేశారు.



# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గౌరవించుకున్నప్పుడే అభివృద్ధి

## సీఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్ :** సమాఖ్య విధానంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పరం గౌరవించుకున్నప్పుడే.. అభివృద్ధి సాధ్యమని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి ఛైర్మన్ ఎస్.మహేంద్రదేవ్ శనివారం ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణను అభివృద్ధి పథంలో తీసుకెళ్లే అంశాలపై చర్చించారు. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించినట్లు సీఎం వివరించారు. "యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నాం. రాష్ట్రంలో పారిశ్రామిక రంగంతోపాటు సేవల రంగం అభివృద్ధి కోసం ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ఉద్యోగులకు సముచితమైన అవకాశాలు కల్పిస్తేనే రాష్టానికి కంపెనీలు వస్తాయి. హైదరాబాద్ చుట్టూ రీజినల్ రింగ్ రోడ్, ఆర్ఆర్ఆర్‌ను ఔటర్‌తో అనుసంధానిస్తూ రేడియల్ రోడ్లు నిర్మిస్తున్నాం" అని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అధిక వడ్డీలకు తీసుకున్న రుణాలపై సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. అధిక వడ్డీల వల్ల రాష్ట్రాభివృద్ధి కుంటుపడుతోందని.. తిరిగి చెల్లింపులు కష్టమవు తున్నాయన్నారు. వడ్డీలు చెల్లించడానికే రాష్ట్ర ఆదాయం ఖర్చు చేయాల్సి వస్తోందని చెప్పారు. రుణాలపై వడ్డీలు తగ్గించుకునే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. స మావేశంలో రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా పాల్గొన్నారు.

# కోల్‌కతాలో మరో దారుణం

## ఐఐఎం విద్యార్థినిపై అత్యాచారం

**కోల్‌కతా,జులై 12 :** పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు పెరిగిపోతున్నాయి. రోజుకో ఘటన వెలుగులోకి వస్తుంది. కోల్‌కతాలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెనేజ్‌మెంట్ చదువుతున్న విద్యార్థినిపై మరో విద్యార్థి అత్యాచారం చేశాడు. ఓ విద్యార్థిని మానసికంగా కృంగిపోవడంతో ఆమె స్నేహితుడు కౌన్సిలింగ్ ఇస్తానని రమ్మని కబురు పంపాడు. విద్యార్థిని బాయ్స్ హాస్టల్‌కు వెళ్లిన తరువాత మత్తు మందు కలిపిన కూల్ డ్రింక్ ఆమెకు స్నేహితుడు ఇచ్చాడు. ఆమె స్పృహ కోల్పోయిన తరువాత ఆమెపై అతడు అత్యాచారం చేశారు. ఆమెకు స్పృహ వచ్చిన తరువాత తనపై అఘాయిత్యం జరిగిందని తెలుసుకొని అతడిని ప్రశ్నించింది. ఈ విషయం బయట చెబితే చంపేస్తానని బెదిరించాడు. వెంటనే ఆమె స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కోల్‌కతాలోని ఓ జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటన దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. నెల రోజుల క్రితం న్యాయ విద్యార్థినిపై సామూహిక అత్యాచారం జరిగిన విషయం విదితమే.

# బిసి రిజర్వేషన్లపై అసెంబ్లీలో చర్చించాలి

## భాజపా ఎమ్మెల్యే పాయల్ శంకర్ డిమాండ్

**హైదరాబాద్, జులై 12 :** బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం హడావుడి చూస్తుంటే బీసీలను మోసం చేస్తున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని భాజపా ఎమ్మెల్యే పాయల్ శంకర్ పేర్కొన్నారు. ఆర్డినెన్సు తీసుకురాకుండానే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేసినట్లు కాంగ్రెస్ నేతలు మాట్లాడుతున్నారని వ్యాఖ్యానించారు. ఇందులో సాధ్యాసాధ్యాలను పరిశీలించడం లేదని అన్నారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ఎప్పుడూ ఇచ్చిన మాట మీద నిలబడలేదన్నారు. బీసీ రిజర్వేషన్లకు మతపరమైన అంశాన్ని జోడించారు. మతపరమైన రిజర్వేషన్లను రాజ్యాంగం, సుప్రీం కోర్టు అంగీకరించవు. శాసనసభ సమావేశాలు ఏర్పాటు- చేసి.. బీసీ రిజర్వేషన్ ఏ విధంగా అమలుచేస్తారో చర్చించాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో న్యాయపరమైన ఇబ్బందులు రాకుండా.. బీసీలకు అన్యాయం జరగకుండా.. ఇచ్చిన మాటకు కట్టు-బడి ఉండాలని పాయల్ శంకర్ డిమాండ్ చేశారు.

# కాళేశ్వరంపై కావాలనే దుష్ప్రచారం

## మండిపడ్డ మాజీ మంత్రి హరీష్ రావు

**సిద్దిపేట, జులై 12 :** కేసీఆర్‌కు మంచి పేరు వస్తుందనే కాళేశ్వరం నుంచి నీళ్లు ఆపుతున్నారని భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. కావాలనే పదేపదే కాళేశ్వరం కూలిపోయిందని ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కాళేశ్వరం నీటిని ఉపయోగించకుండా పక్కన పెట్టారని అన్నారు. సిద్దిపేటలో 167 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడారు. వర్షాలకు గోదావరిలో 8 లక్షల క్యూసెక్కులు వృథాగా పోతున్నాయి. మోటార్లు ఆన్ చేయకుండా రాజకీయాలు చేస్తున్నారు. మోటార్లు ఆన్ చేస్తే వారం రోజుల్లో రంగనాయకసాగర్ నిండిపోతుంది. మేడిగడ్డ కూలితే మోటార్లు, లారీలు ఎలా నడుస్తున్నాయని అన్నారు. రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్‌లు కాళేశ్వరంలో భాగం కావా? ఇవేమీ చూడకుండా కాళేశ్వరం కూలిపోయిందని అసత్య ప్రచారం చేస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై అసెంబ్లీలో చర్చపెడితే.. మీరేం చేశారో.. మేమేం చేశామో మాట్లాడుకుందాం అన్నారు. కేసీఆర్‌కు మంచి పేరు వస్తుందనే కాళేశ్వరం నుంచి నీళ్లు ఆపుతున్నారు. రెండు పిల్లర్లకు మరమ్మతులు చేస్తే ఆరు నెలల్లో నీళ్లు ఇవ్వొచ్చు. మేం ప్రశ్నించడంతోనే కల్వకుర్తి మోటార్లు ఆన్ చేశారు. నాట్లకు నాట్లకు మధ్య కేసీఆర్ రైతుబంధు ఇచ్చారు. ఓట్లకు ఓట్లకు మధ్య మీరు రైతుభరోసా ఇస్తున్నారు. రైతుభరోసాను ఎలా కోత పెడదామనే చూస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు.

# కాశ్మీర్‌లో లోయలో పడ్డ వాహనం

## ఐదుగురు వ్యక్తుల దుర్మరణం

**శ్రీనగర్, జులై 12 :** జమ్ము కశ్మీర్ రాష్ట్రం రాంబన్ జిల్లాలో శనివారం ఉదయం వాహనం లోయలో పడింది. ఈ ఘటనలో ఐదుగురు మృతి చెందారు. గాయపడిన ఐదుగురిని ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులలో యావర్ అహ్మద్ పరిస్థితి విషమంగా ఉన్నట్టు- సమాచారం. యుక్రల్ పోగల పరిస్తాన్ ప్రాంతంలోని సేనాబాతిలో రోడ్డుపక్కన ఉన్న 600 అడుగుల లోయలో పర్యాటకుల వాహనం పడింది. రెస్క్యూ సిబ్బంది, అధికారులు అక్కడికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంపై జమ్ము కశ్మీర్ ముఖ్యమంత్రి ఓమర్ అబ్దుల్లా, కేంద్ర మంత్రి జీతేంద్ర సింగ్ దిగ్భ్రాం÷-రతి వ్యక్తం చేశారు. మృతులు కుటు-ంబాలకు లక్ష రూపాయలు, గాయపడిన 25 వేల రూపాయలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. మృతులు తౌఖర్ అహ్మద్, షకీల్ అహ్మద్, గాయపడిన వారు మహ్మద్ రఫీక్, అబ్దుల్ లతీఫ్, అజాజ్ అహ్మద్‌గా గుర్తించారు. మిగిలిన వారి వివరాలు తెలియాల్సి ఉంది.

# కవిత బిసి రిజర్వేషన్ ఉద్యమం చేశారా

- ఎందుకీ తీన్మార్ స్టెప్పులు వేస్తున్నారో
- మద్యం కుంభకోణంతో తెలంగాణ పరువు తీసిన కవిత
- కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్





**హైదరాబాద్, జులై 12 :** మద్యం కుంభకోణంతో జైలులో ఉన్న తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత బిసి రిజర్వేషన్ల కోసం ఎప్పుడు ఉద్యమం చేశారని కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. బిసి రిజర్వేషన్ల కోసం తాను ఉద్యమించినందునే రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ కోసం సిద్ధమైందని కవిత చెబుతూ తీన్మార్ డాన్సులు చేస్తున్నదని ఆయన ధ్వజమెత్తారు. మద్యం కుంభకోణంతో తెలంగాణ రాష్ట్రానికి చెడ్డ పేరు వచ్చిందని ఆయన శనివారం పార్టీ ఎంపీలు చామల కిరణ్‌కుమార్ రెడ్డి, మల్లు రవితో కలిసి విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ అన్నారు. బిసి రిజర్వేషన్ల విషయంలో తమ పార్టీ మాట తప్పదు, మడమ తిప్పదు అని ఆయన తెలిపారు. బిసిల అభ్యున్నతి కోసం తమ ప్రభుత్వం ఇంత చక్కటి కార్యక్రమాన్ని చేపడితే బిఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు కనీసం హర్షం వ్యక్తం చేయలేదని ఆయన అన్నారు. బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు బిసిల రిజర్వేషన్లు 33 నుంచి 27 శాతానికి తగ్గాయని ఆయన విమర్శించారు. బిసిల పట్ల బిఆర్ఎస్‌కు ఎందుకు అంత అక్కసు అని ఆయన ప్రశ్నించారు. కడుపు నిండా విషం నింపుకున్న బిఆర్ఎస్ నాయకులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని, దీనిని బిసిలు గమనిస్తూనే ఉన్నారని అన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నామని ఆయన తెలిపారు. బిఆర్ఎస్‌లో దెయ్యాలు ఉన్నాయని కవిత లోగడ చేసిన ఆరోపణను మహేష్ కుమార్ గౌడ్ ప్రస్తావిస్తూ ఇప్పుడు ఆ దెయ్యాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. అధికారంలోకి వస్తే బిసిని సిఎం చేస్తామన్న బిజెపి కనీసం అధ్యక్షున్ని అయినా నియమించలేదని ఆయన విమర్శించారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడం కాంగ్రెస్ పార్టీ మార్క్ అని ఆయన తెలిపారు. తాను వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్నప్పుడు కామారెడ్డిలో బిసి డిక్లరేషన్ ప్రకటించానని, ఇప్పుడు పిసిసి అధ్యక్షునిగా ఉన్నప్పుడు బిసి రిజర్వేషన్ల ఆర్డినెన్స్‌కు ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకోవడం సంతోషంగా ఉందని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు.

# 2029 ఎన్నికల్లో ప్రధాన ఎజెండా బీసీ రిజర్వేషన్లే

- అన్ని రాష్ట్రాల్లో అమలైతేనే నిజమైన విజయం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్ :** 2029 ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లే ప్రధాన ఎజెండా కావాలని, అన్ని రాష్ట్రాల్లో ఈ రిజర్వేషన్లు అమలైతేనే నిజమైన విజయం సాధించినట్లవుతుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఆర్డినెన్స్ తీసుకురావాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించిన నేపథ్యంలో కాంగ్రెస్ బీసీ నేతలు, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, ఇతర నాయకులు వేర్వేరుగా శనివారం సీఎం నివాసానికి వచ్చి ఆయనను శాలువాలతో సన్మానించి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, పలు కార్పొరేషన్ల ఛైర్‌పర్సన్లు పాల్గొన్నారు. ఈ సమావేశాల్లో సీఎం మాట్లాడుతూ... "బీసీల వందేళ్ల ఆకాంక్షను రాహుల్ గాంధీ, ఖర్గేల నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ నెరవేర్చింది. స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించడం గొప్ప కార్యక్రమం. గతంలోనూ దళితులు, వెనుకబడినవర్గాలకు కాంగ్రెస్ పార్టీయే రిజర్వేషన్లు కల్పించింది. కులగణనకు ఎన్నో అవాంతరాలు వచ్చినా అధిగమించి... ఏడాదిలో పారదర్శకంగా, పక్కాగా పూర్తి చేశాం. అసెంబ్లీతోపాటు అన్ని వేదికలపై కులగణనపై చర్చించాం. బీసీ రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చాలంటూ జంతర్‌మంతర్‌లో నిర్వహించిన ధర్నాకు 16 పార్టీలు మద్దతు ఇచ్చాయి. మేం ఒత్తిడి తీసుకురావడంతోనే కేంద్రం 2026లో జనగణనలో భాగంగా కులగణన చేపట్టాలని నిర్ణయించింది. బీసీ రిజర్వేషన్లపై భాజపాకు చిత్తశుద్ధి లేదు. వాటిని రాజ్యాంగంలో చేర్చి, చట్టబద్ధత కల్పించాల్సింది కేంద్రంలోని భాజపా ప్రభుత్వమే. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఎంపీలు లక్ష్మణ్, ఆర్.కృష్ణయ్యలు దీన్ని సాధించాలి. రాహుల్ గాంధీ ప్రధానిగా ఉండి ఉంటే 48 గంటల్లో రిజర్వేషన్లకు చట్టబద్ధత సాధించేవాడిని. ప్రధానిని తెలంగాణకు చెందిన భాజపా మంత్రులు ప్రశ్నించాలి. రిజర్వేషన్ల కోసం ఇంకా ఏం చేయాలన్నా... నేను సిద్ధం. అవసరమైతే అర్ధరాత్రి కూడా మంత్రివర్గ సమావేశం ఏర్పాటు చేస్తా. రిజర్వేషన్ల విషయంలో నన్ను ప్రశ్నించే నైతిక హక్కు ప్రతిపక్షాలకు లేదు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకే ఇంతకాలం స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా వేశాం. రిజర్వేషన్లను 50 శాతానికి మించి పెంచొద్దని గత కేసీఆర్ ప్రభుత్వం పంచాయతీరాజ్ చట్టం చేసింది. అప్పుడు మంత్రులుగా ఉన్న గంగుల కమలాకర్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌యాదవ్‌లతోనే కేసీఆర్ మాపై విమర్శలు చేయిస్తున్నారు. అందరూ రక్షణ కవచంలా ఉండి రిజర్వేషన్లను కాపాడుకోవాలి. ఎవరైనా కోర్టుకు వెళ్తే వాదించడానికి దిల్లీ నుంచి ఉద్దండులైన న్యాయవాదులను నియమిస్తాం. రిజర్వేషన్లకు వ్యతిరేకంగా కాగితం పెట్టినవారిని, వాళ్లతో పెట్టించినవారిని సామాజిక బహిష్కరణ చేస్తామని ప్రకటించండి. 42 శాతం బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ ఎంపీలతో పాటు ఇండియా కూటమి ఎంపీలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తాం" అని అన్నారు.



# 15 దఫాల్లో 10 లక్షల ఉద్యోగాలు

## వికసిత భారత్‌లో యువత పాత్ర కీలకం: కిషన్‌రెడ్డి

**సికింద్రాబాద్ :** వికసిత భారత్‌లో యువత సేవలను వినియోగించుకునేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక రంగాల్లో ఉద్యోగాలను భర్తీ చేస్తోందని కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. శనివారం సికింద్రాబాద్ రైల్ కళారంగ్‌లో జరిగిన రోజ్‌గార్ మేళాలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన వారికి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఇప్పటి వరకు 15 దఫాలుగా రోజ్‌గార్ మేళా ద్వారా 10 లక్షల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చినట్లు వెల్లడించారు. 16వ రోజ్‌గార్ మేళాలో 51 వేల మందికి నియామకపత్రాలు అందజేసినట్లు తెలిపారు. నైపుణ్యాభివృద్ధి ద్వారా సాధికారత కల్పిస్తూ దేశాన్ని అన్ని రంగాల్లో బలోపేతం చేసే దిశగా ప్రధాని మోదీ కృషి చేస్తున్నారన్నారు.

# బాసర క్షేత్రాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం

## దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ



**నిర్మల్ :** బాసర సరస్వతీ క్షేత్రాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ చెప్పారు. శనివారం నిర్మల్ జిల్లా బాసరలోని సరస్వతీ అమ్మవారి ఆలయంలో మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, ఆదిలాబాద్ ఎంపీ నగేశ్, ముథోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్‌తో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. పునరుద్ధరించిన వంద గదుల వసతి భవనంతో పాటు ఆలయ కార్యనిర్వహణాధికారి నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. బాసర క్షేత్రాన్ని యాదాద్రి తరహాలో అభివృద్ధి చేయడానికి రూ.40 లక్షలు మంజూరు చేస్తూ జీవో జారీ చేశామన్నారు. అదనంగా రూ.కోటి నిధులు ఇవ్వడానికి కూడా సిద్ధంగా ఉన్నామని, పనులకు సంబంధించి ఆలయ అధికారులు డీపీఆర్ సమర్పించాలని ఆదేశించారు. రానున్న గోదావరి, కృష్ణా పుష్కరాల కోసం తగు వసతులు, భద్రతా ఏర్పాట్లకు అవసరమైన నిధులు కేటాయిస్తామన్నారు. త్వరలో ఆలయానికి రెగ్యులర్ ఈవో, సిబ్బందిని నియమిస్తామని హామీ ఇచ్చారు. గత భారాస ప్రభుత్వం యాదాద్రి ఆలయం మినహా ఇతర దేవాలయాలను పట్టించుకోలేదని మంత్రి సురేఖ ఆరోపించారు. కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలాచారి తదితరులు పాల్గొన్నారు.

# 3.58 లక్షల కొత్త కార్డుల జారీ

- 95.56 లక్షలకు చేరిన కార్డులు
- 3.09 కోట్ల మంది లబ్ధిదారులు
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్:** పేదలకు రేషన్ పథకంలో రాష్ట్రం సరికొత్త మైలురాయికి చేరుకుందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. జులై 14 నాటికి రాష్ట్రంలో మొత్తం రేషన్‌కార్డుల సంఖ్య 95,56,625కి.. లబ్ధిదారుల సంఖ్య 3,09,30,911కి పెరగనుందని తెలిపారు. ఆహారభద్రతలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం తిరుమలగిరిలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొనే సభలో కొత్త కార్డుల పంపిణీ జరుగుతుందన్నారు. ఈ మేరకు శనివారం ఉత్తమ్ ఓ ప్రకటన విడుదల చేశారు.

### ఏటా రూ.1150 కోట్ల భారం

'కొత్తగా 3,58,187 రేషన్‌కార్డులను సోమవారం జారీ చేయనున్నాం. తద్వారా 11,11,223 మందికి లబ్ధి కలుగుతుంది. పాత కార్డుల్లో కొత్త సభ్యుల్ని 4,41,851 మందిని చేరుస్తున్నాం. మొత్తం 15,53,074 మందికి రేషన్ ప్రయోజనం కలుగుతుంది. మొదటిదశగా నారాయణపేట జిల్లాలో గతంలో నిర్వహించిన సభ ద్వారా 2,03,156 కొత్త కార్డులు మంజూరుచేశాం. అందులో లబ్ధిదారుల సంఖ్య 5,90,488 మంది. పాతకార్డుల్లో అదనంగా చేర్చిన సభ్యులు 6,39,784 మంది. మొత్తం 12,30,272 మంది రేషన్ అందుకుంటున్నారు. రెండోదశ ఈనెల 14వ తేదీ నుంచి లబ్ధిదారుల సంఖ్య 15,53,074 మందికి పెరగనుంది. పేదల సంక్షేమమే లక్ష్యంగా, పారదర్శకతతో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఇది. కొత్త రేషన్ కార్డుల జారీ, పేర్లను చేర్చడం వల్ల రాష్ట్ర ప్రభుత్వంపై ఏడాదికి రూ.1150.68 కోట్ల ఆర్థిక భారం అదనంగా పడుతుంది' అని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు.




# ఆధార్ కేంద్రం నడపాలంటే పరీక్ష పాసవ్వాల్సిందే

## 'ఇన్ హౌస్ మోడల్'లోకి రాష్ట్రంలోని అన్ని కేంద్రాలు

**హైదరాబాద్:** ఆధార్ శాశ్వత కేంద్రాలను నడపాలంటే ఇకపై భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ(యూఐడీఏఐ) నిర్వహించే పరీక్షలో 65% మార్కులు తెచ్చుకోవాలి. పదేళ్లుగా కేంద్రాలను నిర్వహిస్తున్న వారు సైతం పరీక్షలో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. తెలంగాణలోని ఆధార్ శాశ్వత కేంద్రాలన్నీ ఏక రీతి (ఇన్-హౌస్ మోడల్) విధానంలోకి మారడమే ఇందుకు కారణం. ఈ విధానాన్ని యూఐడీఏఐ మూడేళ్ల క్రితం నుంచే అమలు చేస్తోంది. మన రాష్ట్రంలోని కొందరు ఆధార్ కేంద్రాల నిర్వాహకులు వేతనాలకు బదులు కమీషన్ కోరుతూ హైకోర్టును ఆశ్రయించడంతో ఈ విధానం అమలులోకి రాలేదు. ఇటీవల యూఐడీఏఐ ప్రతినిధులు, నిర్వాహకుల మధ్య హైకోర్టు సయోధ్య కుదిర్చింది.

- ఇన్-హౌస్ మోడల్ కేంద్రాల పరికరాలకు డిపాజిట్లు చెల్లించాలని ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చింది. వారికి ల్యాప్‌టాప్ సహా రూ.1.50 లక్షల విలువైన సామగ్రి అందుతుంది.
- అవకతవకలకు పాల్పడిన నిర్వాహకులను తొలగించి కేంద్రాన్ని కొత్తవారికి అప్పగిస్తారు. బాధ్యులపై కఠిన చర్యలుంటాయి.
- రాష్ట్రంలో మొత్తం 1,151 ఆధార్ శాశ్వత కేంద్రాలను ఏర్పాటు చేయగా వివిధ కారణాలతో 424 మూతపడగా 727 కేంద్రాలు పనిచేస్తున్నాయి. కొత్త విధానంతో అన్ని కేంద్రాలు అందుబాటులోకి వస్తాయి.
- పేర్లు, పుట్టిన తేదీ, చిరునామా, సెల్‌నంబరు వంటి వాటిని కార్డుదారులే నేరుగా ఆన్‌లైన్‌లో మార్చుకోవచ్చు. ఇకపై ఇన్-హౌస్ కేంద్రాల్లో వేలిముద్రల నవీకరణ, నూతన కార్డుల జారీ మాత్రమే చేపడతారు. మీ-సేవ వంటి ఆన్‌లైన్ కేంద్రాల్లోనూ పేర్లు, చిరునామాల మార్చుకునే సేవల్ని అందుబాటులోకి తేనున్నారు.

# రవాణా శాఖలో విప్లవాత్మక మార్పులు

- వాహనాల ఫిట్‌నెస్, డ్రైవింగ్‌పై అవగాహన
- మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి



**నల్లగొండ, జులై 12 :** తెలంగాణలో రవాణా శాఖలో విప్లవాత్మక మార్పులు తెచ్చామని మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. వాహనాల ఫిట్‌నెస్, డ్రైవింగ్‌పై అవగాహన లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పుకొచ్చారు. శనివారం నల్లగొండలో మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. తెలంగాణలో 17 ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్‌లు నిర్మిస్తున్నామని చెప్పుకొచ్చారు. 15 సంవత్సరాలు దాటిన వాహనాలు స్క్రాప్‌కి వెళ్తున్నాయని మంత్రి పొన్నం ప్రభాకర్ వివరించారు. రాష్ట్రం వాహన సారథిలోకి ఎంట్రీ– అయిందని చెప్పారు. వాహనాల ఫిట్‌నెస్, పొల్యూషన్ అన్నీ వాహన సారథిలో చూసుకోవచ్చని తెలిపారు. ఏఐ ద్వారా డ్రైవింగ్ లైసెన్స్‌లు ఇచ్చేలా చేస్తున్నామని అన్నారు. యాక్సిడెంట్‌లు చేస్తే లైసెన్స్‌లు వెంటనే రద్దు చేస్తున్నామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఆటోమేటిక్ –టె–స్టింగ్ స్టేషన్, స్క్రాప్ పాలసీ, ఈవీ పాలసీ తీసుకువచ్చామని నొక్కిచెప్పారు. డ్రైవింగ్ –ట్రైనింగ్ సెంటర్లు వస్తున్నాయని...అక్కడ –ట్రైనింగ్ తీసుకున్న తర్వాతనే లైసెన్స్‌లు వస్తాయని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. నల్గొండ జిల్లాలో రూ.8 కోట్లతో ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ఇది తెలంగాణలోనే రెండవ ఆ÷ూ సెంటర్ అని ఉద్ఘాటించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడంలో పొన్నం ప్రభాకర్ కేబినెట్‌లో కొట్లాడారని గుర్తుచేశారు. నిజాం కాలంలో మొదటి డిపో నార్కెట్‌పల్లి అని ఇప్పుడు 60 బస్సులు ఉన్నాయని.. ఇంకో 20 బస్సులు కావాలని సూచించారు. నల్లగొండ డిపోను నూతనంగా నిర్మించాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## కుల సర్వే, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు

- కాంగ్రెస్ ప్రభుత్వ చారిత్రక నిర్ణయాలు
- వీటిని అభినందించలేకపోతున్న బిఆర్ఎస్
- పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్



**హైదరాబాద్, జూలై 12 :** కుల సర్వే, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు.. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. కీలకమైన ఈ నిర్ణయాలను అభినందించేందుకు భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్‌కు మనసు రావడం లేదని విమర్శిం చారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడిన మహేశ్ కుమార్ గౌడ్.. విపక్షాల తీరుపై విమర్శలు గుప్పిం చారు. గతంలో ఎన్నో బిల్లుల విషయంలో భారత రాష్ట్ర సమితి.. భారతీయ జనతా పార్టీకి మద్దతు ఇచ్చింది. బీసీలకు మేలు జరిగే నిర్ణయంపై మాత్రం కేసీఆర్ నోరు విప్పడం లేదు. కడుపునిండా విషం పెట్టుకొని కౌగిలించుకొన్న ట్లుగా విపక్షాల ధోరణి ఉంది. పదేళ్లు అధికారంలో ఉన్న భారత రాష్ట్ర సమితి బీసీలకు రిజర్వేషన్ల పెంపు అంశంపై ఏనాడూ దృష్టి పెట్టలేదు. మేం సాధించిన రిజర్వేషన్ల పెంపును.. కవిత తన విజయంగా చెప్పడం హాస్యాస్పదంగా ఉంది. బీసీ రిజర్వేషన్ల పెంపు ప్రక్రియను మేము చేపట్టినప్పుడు కవిత జైలులో ఉన్నారు. తిహాడ్ జైలులో ఉన్న కవిత బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం ఎప్పుడు పోరాటం చేశారో చెప్పాలి. ఆమె మాటలు విని తెలంగాణ సమాజం నవ్వుకుంటోంది. కవిత ఇప్పుడు ఏ పార్టీలో ఉన్నారో ఆమెకైనా స్పష్టత ఉందా? అని ఎద్దేవా చేశారు. ఇదిలావుంటే మిగులు రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పుల రాష్ట్రంగా ఎందుకు మార్చారో భారత రాష్ట్ర సమితి నేతలు చెప్పాలని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. చర్చకు రాకుండా సీఎం రేవంత్‌రెడ్డిని ఎందుకు దూషిస్తున్నారని ప్రశ్నించారు. అసెంబ్లీలో అర్థవంతమైన చర్చ జరగాలని ప్రజలు ఆశిస్తున్నారని తెలిపారు. నీటిపారుదల శాఖ గురించి తాము మాట్లాడుతుంటే అసత్యాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.


## అనురాగ్ వర్సిటీలో స్లాబ్ కూలి నలుగురికి గాయాలు

**మేడ్చల్, జులై 12 :** బీఆర్ఎస్ జనగాం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి చెందిన అనురాగ్ యూనివర్సిటీలో శనివారం ప్రమాదం జరిగిం ది. పోచారం పోలీస్ స్టేషన్ పరిధిలోని వెంకటాపూర్ సమీపం లో ఈ ఘటన చోటు–చేసుకుంది. స్లాబ్ కూలి నలుగురు కూలీలకు గాయాలయ్యాయి. వెంటనే వారిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. ఇద్దరి కూలీల పరిస్థితి విషమంగా ఉండటంతో ఎమర్జెన్సీ వార్డులో చికిత్స పొందు తున్నారు. ఎఫ్‌టీఎల్‌లో నూతనంగా నిర్మాణాలు చేపడుతు న్నారని గతంలో అనురాగ్ యూనివర్సిటీపై పలువురు ఫిర్యా దు చేశారు. ఈ క్రమంలో మీడియాను కూడా యూనివర్సిటీ సిబ్బంది లోపలికి అనుమతిం చలేదు. ఈ ఘటనపై పోలీసు లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కూలీల కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వారు ఆస్పత్రికి చేరుకున్నారు. ఈ ఘటనకి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## కల్తీ కల్లు బాధితుల్లో పెరుగుతున్న కిడ్నీ బాధితులు

**కిడ్నీ పనిచేయని వారి సంఖ్య తొమ్మిదికి చేరిక**

**హైదరాబాద్, జులై 12 :** కూకట్‌పల్లి కల్తీ కల్లు ఘటనలో బాధితులకు వైద్యం కొనసాగుతోంది. కల్తీ కల్లు బారిన పడిన వారిలో 33 మంది నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతు న్నారు. నిమ్స్‌లో చికిత్స పొందుతున్న వారిలో కిడ్నీ బాధితుల సంఖ్య పెరుగుతోంది. ఇప్పటికే కిడ్నీ పనిచేయని బాధితుల సంఖ్య తొమ్మిది మందికి చేరింది. ఇప్పుడు తాజాగా మరో ఇద్దరు బాధితులకు కూడా డయాలసిస్ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. మరోవైపు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిలో 11 మంది ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు– వైద్యులు తెలిపారు. ఇంకో 12 మందిని అబ్జర్వేషన్‌లో ఉంచి చికిత్స అందిస్తున్నారు డాక్టర్లు. మరో 19 మంది వివిధ ఆసుపత్రు ల్లో చికిత్స పొందుతున్నారు. ఈ కల్తీ కల్లు ఘటనలో ఇప్పటి వరకు తొమ్మిది మంది మృత్యువాత పడిన విషయం తెలిసిం దే. ఇక కల్తీ కల్లు ఘటనలో ప్రధాన నిందితుడు కూన సత్యం గౌడ్‌ను కూకట్‌పల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆయన కుమారులు రవితేజ గౌడ్, సాయితేజ గౌడ్‌ను ఇప్ప టికే పోలీసులు అరెస్ట్ చేశారు. కూన సత్యం గౌడ్ అరెస్ట్‌తో నిందితుల సంఖ్య ఐదుకు చేరింది. కల్తీ దందాపై చర్యలు తీసుకోని కారణంగా ఎక్సైజ్ సీఐను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. అంతేకాకుండా మరికొంత మందిపై విచారణకు ఎక్సైజ్ శాఖ ఆదేశాలు జారీ చేసింది.



## శ్రీశైలం దారిలో భారీగా ట్రాఫిక్ జామ్

**12 కిలోమీటర్ల మేర నిలిచిన వాహనాలు**

**హైదరాబాద్, జులై 12 :** వారాంతపు వరుస సెలవులు రావడం.. దానికి తోడు శ్రీశైలం డ్యాం గేట్లు– ఎత్తడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు, సందర్శకుల తాకిడి ఎక్కువైంది. దీంతో హైదరాబాద్, శ్రీశైలం రహదారిపై భారీ ట్రాఫిక్ జామ్ అయ్యింది. వాహనాలు చీమల బారులు తీరినట్లుగా రోడ్డుపై నిలిచిపోయాయి. శనివారం శ్రీశైలం వెళ్లే దారిలో దోమలపెంట నుంచి సున్నిపెంట వరకు 12 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. 3 గంటలకు పైగా వాహనాలన్నీ రోడ్లపై నిలిచిపోయాయి. దీంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. నల్లమల అడవి మార్గంలో రోడ్లపై కిలోమీటర్ల మేర వేల వాహనాలు నిలిచిపోవడంతో పోలీస్ సిబ్బంది ట్రాఫిక్ క్లియర్ చేస్తున్నారు. ఎగువన కురుస్తున్న వర్షాలతో శ్రీశైలానికి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో గేట్లను ఎత్తడంతో డ్యాం సందర్శకులకు ఆకర్శనీయంగా కనువిందు చేస్తోంది. నల్లమల ప్రకృతి అందాలు, డ్యాంను చూడటంతో పాటు– శ్రీశైల ఆలయ దర్శనం కోసం భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చారు. దీంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. వేల వాహనాలు రోడ్లపైన బారులు తీరాయి. ట్రాఫిక్ క్లియర్ చేసేందుకు మరింత సమయం పట్టనుందని పోలీసులు తెలిపారు. శ్రీశైలం జలాశయానికి ఇన్ ఎ÷–లో తగ్గడంతో శనివారం మూడు గేట్లను మూసేశారు అధికారు లు. ప్రస్తుతం ఒక గేటు– ద్వారా 4,497 క్యూసెక్కుల నీరు నాగార్జున సాగర్ కు చేరుతోంది. సుంకేసుల, జూరాల నుంచి 1,37,635 క్యూసెక్కుల ఇనో వస్తుంది. జూలై నెలలోని శ్రీశైలం జలాశయానికి వరద వచ్చి.. డ్యామ్ పూర్తి స్థాయిలో నిండింది.

## బోనాల చెక్కుల పంపిణీలో ఉద్రిక్తత

**కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య తోపులాట**

**హైదరాబాద్, జులై 12 :** సికింద్రాబాద్‌లో బోనాల చెక్కుల పంపిణీలో ఉద్రిక్తత చోటు– చేసుకుంది. ప్రోటోకాల్ పాటించడం లేదంటూ బీఆర్ఎస్ నేతలు ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య తోపులాట చోటు– చేసుకుంది. సీఎం సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి, సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు ముందే కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు పోటా పోటీ నినాదాలు చేశారు. చెక్కులు పంపిణీ చేస్తుండగా బీఆర్ఎస్ నేతలు స్టేజ్‌పై కరెంట్ కట్ చేశారు . బీఆర్ఎస్ నేతల తీరుపై వేం నరేందర్ రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. త(ప్రోటోకాల్ పాటించడం లేదంటూ బీఆర్ఎస్ కార్పొరేటర్లు ఆందోళనకు దిగారు. ప్రోటోకాల్ పేరుతో ఎమ్మెల్యే పద్మారావు వివాదం సృష్టిస్తున్నారంటూ డిప్యూటీ– మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే పద్మారావు, కాంగ్రెస్ ఇంఛార్జ్ సంతోష్ అనుచరుల మధ్య వాగ్వాదం చోటు– చేసుకుంది. పరస్పరం నినాదాలు చేసుకున్నారు. దీంతో సికింద్రాబాద్ కట్టమైసమ్మకు సంబంధించిన బోనాలు వేడుక చెక్కుల పంపిణీ వివాదాస్పదంగా మారింది. ప్రోటో కాల్ ప్రకారం అన్నీ జరిగాయని కాంగ్రెస్ నేతలు చెబుతు న్నారు. ప్రోటోకాల్ కోసమే తప్ప ఎమ్మెల్యే అసలు తమకు అందుబాటులో ఉండటం లేదంటూ హస్తం నేతలు ఆందో ళనకు దిగారు. తీవ్ర గందరగోళం నెలకొనడంతో వెంటనే పోలీసులు కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తలను చెదరగొట్టారు.

## నేడు ఉజ్జయిని మహంకాళి బోనాలు

- భారీగా ఏర్పాట్లు చేసిన అధికారులు
- నేడు పట్టువస్త్రాలు సమర్పించనున్న సిఎం రేవంత్



**హైదరాబాద్, జులై 12 :** తెలంగాణలో బోనాల జాతర అంగరంగ వైభ వంగా కొనసాగుతోంది. ఇప్పటికే గోల్కొండ బోనా లు ముగియగా సికిం ద్రాబాద్ లష్కర్ బోనాల జాతర నిర్వహించేందుకు అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు– పూర్తి చేశారు. ఆదివారం సికింద్రాబాద్ ఉజ్జయిన మహంకాళి బోనాలు జరగనున్నాయి. ప్రభుత్వం తరపున సీఎం రేవంత్ రెడ్డి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించను న్నారు. లక్షలాదిమంది భక్తులు తరలి వచ్చే అవకాశంతో అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేస్తోంది ప్రభుత్వం. భక్తులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకుంటోంది. ఆదివారం మహంకాళి బోనాలకు ఉదయం 4.10 బ్రహ్మ ముహూర్తంలో అమ్మవారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు జరుగుతాయి. ఆలయ ధర్మకర్త కుటుంబం నుంచి అమ్మవారికి తొలి బోనం సమర్పించనున్నారు. సోమవారం రోజు రంగం భవిష్యవాణితో పాటు– అమ్మవారి అంబారి ఊరేగింపు, ఆదివారంరాత్రి, సోమవారం రాత్రి అమ్మవారి ఫలహర బండ్ల ఊరేగింపు ఉ ంటుంది. అమ్మవారి దర్శనం కోసం వచ్చే భక్తుల కోసం 6 క్యూలైన్ లు ఏర్పాటు– చేశారు భక్తులు. బాట షోరూం నుంచి 2 , రాంగోపాల్ పేట్ పోలీస్ స్టేషన్ నుంచి 2, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి 2 క్యూలైన్లు ఉన్నాయి. క్యూ లైన్ లో 16 మీటర్లకు ఒక ఎమర్జెన్సీ గేట్ ఏర్పాటు– చేశారు. భారీ పోలీస్ బందోబస్తుతో పాటు 70 సీసీటీ–వి కెమెరాల నడుమ బోనాల జాతర జరగనుంది. భక్తులకు ఇబ్బంది కలగకుండా, మొబైల్ వాష్ రూమ్స్ ఏర్పాటు చేశారు. ఉ దయం వేళల్లో రద్దీ ఉంటుంది కాబట్టి జోగినిలు, శివశక్తులకు దర్శనం చేసుకునేందుకు స్పెషల్ టైం కేటాయించారు. శివ శక్తులు, జోగినిల కోసం మధ్యాహ్నం 2గంటల నుంచి 4 గంటల వరకు సమయం కేటాయించారు.

## టిటిడిలో అన్యమతస్థులు ఉన్నమాట నిజమే

- వీరిపై విచారణ కొనసాగుతోందన్న ఆనం
- నిరుద్యోగ అర్చకస్వాములకు 3వేల నిరుద్యోగ భృతి
- టిటిడి ఇవోతో సమావేశమైన మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి



**తిరుమల, జులై 12 :** టీటీడీలో అన్యమతస్థులు ఉండేది వాస్తవమని దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి స్పష్టం చేశారు. టీటీడీలో వెయ్యి మంది అన్యమతస్థులు ఉన్నారన్న కేంద్రమంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై విచారణ కొనసాగుతోందన్నారు. అయితే ఎవరున్నా వారిని తొలగిస్తామని అన్నారు. రాష్ట్రంలో అర్చక నిరుద్యోగు లుగా ఉన్న అర్చక స్వాములకు భృతి ఇవ్వాలని మేనిఫెస్టోలో ఉందని దేవాదాయశాఖ మంత్రి అన్నారు. ఆ మేరకు రాష్ట్రంలో 590 మంది వేద పండితులు నిరుద్యోగులుగా ఉన్నారని.. వారికి 3 వేల రూపాయలు ఇవ్వాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. శ్రీవాణి ట్రస్టు ద్వారా రాష్ట్రంలోని పునర్నిర్మాణంలో ఉన్న ఆలయాలకు రూ.147 కోట్లు విడుదల కాకుండా నిలిచిపోయాయన్నారు. శ్రీవాణి ట్రస్టు ద్వారా మరో రూ.11 కోట్ల నిధులు మిగతా ఆలయాలకు రావాల్సి ఉందని తెలిపారు. వీటన్నింటిపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని బోర్డు, అధికారులు చెప్పారని మంత్రి వెల్లడించారు. తిరుమలలో టీటీడీ, దేవాదాయశాఖ సంయుక్త సమావేశం ముగిసింది. ఈ సందర్భంగా దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ.. టీటీడీ చైర్మన్, ఈవో, అదనపు ఈవో, దేవాదాయ శాఖ అధికారులతో కలిసి సమీక్ష చేశామన్నారు. గతంలో సీఎం చంద్రబాబు దగ్గర జరిగిన సమావేశంలో ఆలయాలకు సంబంధించిన కొన్ని సమస్యలు ముందుకు వచ్చాయని.. వాటిని చర్చించుకొని రండి అని ముఖ్యమంత్రి ఆదేశించారని తెలిపారు. దేవాదాయ చట్టం ప్రకారం 9 శాతం కామన్ గుడ్ ఫండ్ టీటీడీ నుంచి తీసుకోవాల్సిన నిబంధనలు ఉన్నాయని చెప్పారు. గతంలో 5 శాతం ఉన్న దానిని 9 శాతానికి పెంచామని తెలిపారు. విజయవాడ దుర్గ గుడికి వెళ్లేందుకు మరో రోడ్డు మార్గం వేసేందుకు టీటీడీ సహకారం కావాలని కోరారు. టీటీడీ కాలేజీ, పాఠశాలల్లో ఉన్న 192 పోస్టులను ఒప్పంద లెక్చరర్‌లతో భర్తీ చేసేందుకు చర్చించినట్లు– మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు. కాగా.. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు అధ్యక్షతన తొలి సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో టీటీడీ ఈవో, అదనపు ఈవో, దేవాదాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.కామన్ గుడ్ ఫండ్ (సీజీఎఫ్) నిధుల విడుదల, శ్రీవాణి ట్రస్ట్ నిధులతో నిర్మిస్తున్న ఆలయాల వివరాలు, ఆలయాల పునరుద్ధరణ మరియు పరిరక్షణ, వాటి పురోగతి తదితర ముఖ్యమైన అంశాలపై విస్తృతంగా చర్చించారు.



## భద్రాద్రి వద్ద పెరుగుతున్న గోదావరి

**భద్రాచలం, జూలై 12 :** భద్రాచలం వద్ద గోదావరి ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. శనివారం ఉదయానికి నీటిమట్టం 40.5 అడుగులకు చేరింది. ఎగువ నుంచి వస్తున్న వరదతో పాటు శబరి నది ఉద్ధృతి వల్ల గోదావరిలో నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. రెండు రోజుల క్రితం 23 అడుగులు ఉన్న గోదావరి ప్రవాహం.. నేడు 40.5 అడుగులకు చేరింది. దీంతో స్నానఘట్టాల ప్రాంతంలోని చాలా మెట్లు– వరదనీటిలో మునిగిపోయాయి. దుమ్ముగూడెం మండలం పర్ణశాల వద్ద వరద ఉద్ధృతి కొనసాగుతోంది. సీత వాగు వద్ద నార చీరల ప్రాంతం, సీతమ్మ వారి విగ్రహం వరద నీటిలో మునిగిపోయింది. గోదావరిలో నీటిమట్టం 43 అడుగులకు చేరితే అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేయనున్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వానిది ప్రచారార్భాటం

- స్కూటీలు, పెళ్లికి లక్ష నగదు, తులం బంగారం ఏవీ?
- ప్రభుత్వంపై బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత విమర్శలు



**రంగారెడ్డి, జూలై 12 :** ఈ ప్రభుత్వం ప్రజలకు సేవ చేయడం కంటే ప్రచారానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ఎన్నికల ముందు అమ్మాయిలకు స్కూటీలు, పెళ్లికి లక్ష రూపాయల నగదు, తులం బంగారం ఇస్తామని చేసిన హామీల్లో ఏ ఒక్కదాన్ని కూడా ఈ ప్రభుత్వం నెరవేర్చలేదని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గ పర్యటనలో పాల్గొన్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, తెలంగాణ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనను టార్గెట్ చేసిన ఆమె, ఈ ప్రభుత్వం ప్రజలకు సేవ చేయడం కంటే ప్రచారానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తోందని ఆరోపించారు. రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీకి తరచూ వెళ్లే వ్యక్తిగా, రాష్ట్రానికి తక్కువ సమయాన్ని కేటాయిస్తున్నారని విమర్శించారు. ఇందిరమ్మ ఇళ్ల కమిటీ–లు మొత్తం కాంగ్రెస్ కార్యకర్తలతోనే నిండి ఉన్నాయని ఆరోపించిన కవిత, సీఎం సొంత జిల్లా అయిన మహబూబ్ నగర్‌లో అంబులెన్సులకు డీజిల్ లేక అస్తవ్యస్త పరిస్థితులు నెలకొన్నాయని మండిపడ్డారు. రేషన్ షాపుల్లో పంపిణీ చేస్తున్న సన్న బియ్యంలో 50 శాతం వరకు నాణ్యతలేని దొడ్డుబియ్యమే ఉండటం దారుణమని వ్యాఖ్యానించిన ఆమె, దీనిని ఆధారాలతో నిరూపిస్తామని చెప్పారు. మరోవైపు ఉచిత బస్సు ప్రయాణాల పేరుతో గ్రామాలకు వెళ్లే బస్సులను తక్కువ చేశారని, ఫ్రీ పథకాలు అందిస్తామనే చెప్పి సేవలు కట్ చేసిన దారుణ పాలన ఇది అని విమర్శించారు. ఇప్పటికే ఈ ప్రభుత్వం రెండు లక్షల కోట్ల రూపాయల అప్పు చేసి రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టిందని కూడా ఆమె ఆరోపించారు. ఇది పనిచేసే ప్రభుత్వం కాదు... ప్రజలే వెంటే ఉండి పని చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని హేళన చేసిన కవిత, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఓటేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు.



## మావోలకు భారీ ఎదురుదెబ్బ

**23మంది మావోల లొంగుబాటు**

**రాయపూర్, జూలై 12 :** ఛత్తీస్‌గఢ్‌లో వరుస లొంగుబాట్లతో మావోయిస్టు పార్టీకి భారీ ఎదురుదెబ్బ తగిలింది. భారీగా మావోలు లొంగిపోయారు సుక్మా జిల్లా ఎస్పీ కిరణ్ చవాన్ ఎదుట శనివారం 23 మంది మావోయిస్టులు లొంగిపోయారు. శుక్రవారం నారాయణపూర్ జిల్లాలో ఎస్పీ రాబిన్‌సన్ ఎదుట 22 మంది మావోయిస్టులు లొంగిపోయిన విషయం తెలిసిందే. సుక్మా జిల్లాలో లొంగిపోయిన 23 మందిపై రూ.1.18 కోట్ల రివార్డ్ ఉన్నట్లు ఎస్పీ వెల్లడించారు. లొంగిపోయిన వారిలో 9మంది మహిళా మావోయిస్టులు ఉ న్నారు. లొంగిపోయిన మావోయిస్టులకు రాష్ట్ర ప్రభుత్వం గృహాలను నిర్మిస్తుందని ఆ రాష్ట్ర హోంమంత్రి విజయ శర్మ ప్రకటించారు. నక్సలిజం.. చాలామందిని వారి కుటు–ంబాలకు దూరం చేయడమే కాకుండా తండ్రి అయ్యే ఆనందం కూడా కోల్పోయేలా చేస్తుందని హోంమంత్రి ఆక్షేపించారు. ఉద్యమంలో ఉండి స్టెరిలైజేషన్ చేయించుకున్న వారు జనజీవన స్రవంతిలోకి వస్తే.. ఐవీఎఫ్ ద్వారా తల్లిదండ్రులు అయ్యే అవకాశం కల్పిస్తామన్నారు. పునరావాస కేంద్రాల్లో ఉంటు–న్న యువతి, యువకులకు అవసరమైతే సామూహిక వివాహాలు జరిపిస్తామని మంత్రి వెల్లడించారు. సుక్మా జిల్లా మాజీ కలెక్టర్ అలెక్స్ పాల్ మీనన్‌ను కిడ్నాప్ చేసిన ఘటనలో కీలక పాత్ర వహించిన మావోయిస్టు నేత లోకేష్ కూడా లొంగిపోయిన వారిలో ఉన్నారు.

## సంపాదకీయం

# ఉచిత పథకాలు ఎవడబ్బ సొమ్ము!



అప్పులు చేసి అభివృద్ధి చేస్తున్నామన్న పాలకుల ధోరణి కారణంగా ..ఏటేటా రాష్ట్రాల్లో అప్పుల మూట పెరుగుతోంది. ఉచిత పథకాలే అభివృద్ధి అన్నచందంగా పాలన సాగుతోంది. అభివృద్ధి పక్కకుపోయింది. కేవలం పందేరాలు కొనసాగుతున్నాయి. విద్య,వైద్యరంగాలను విస్మరించారు. మంచినీటి సరఫరా సరిగా జరగడం లేదు. రోడ్ల విస్తరణ కానరావడం లేదు. దోమల నిర్మూలన అటకెక్కింది. పారిశుద్ధ్యం పడకేసింది. గ్రామాల్లో ఆర్థిక కార్యకాలాపాలు సాగడం లేదు. ఈ క్రమంలో కొత్తకొత్త పథకాలతో ప్రజలకు దోచిపెడుతూ దానకర్ణుడిలా గొప్పలు చేసామని తెలుగు వల్లభులు చాటుకుంటున్నారు. చేతికి ఎముక లేదన్నట్లుగా పథకాలతో ఖజానాను ఊడ్చేస్తున్నారు. ఇదంతా అభివృద్ధిగా చూపుతూ..దేశమంతా ఇదే పాటించాలన్న డిమాండ్‌ను పెడుతున్నారు. ఉచిత విద్యుత్, కిలో రూపాయికే సన్న బియ్యం, ఉచిత బస్సు, ఇంటింటికీ పెన్షన్లు వంటి పథకాల జోరు కొనసాగుతోంది. వీటికి తోడు కులాల కుంపట్లు రగిలిస్తున్నారు. ఇవన్నీ అమలు చేయడానికి అప్పులు చేయడం, వడ్డీలకు మళ్లీ అప్పులు చేయడం, వివిద రకాల్లో పన్నులు వడ్డించడం అలవాటయ్యింది. ఆదాయం పెచే శాఖలపై అదేపనిగా సమీక్షలు చేయడం చేస్తున్నారు. నిజానికి రైతులకు ఎంత ఉచిత విద్యుత్ అవసరమో లెక్కలేదు. ఎవరికి ఎంత పొలం ఉంది..వారికి ఎంత విద్యుత్ అసవరం.. వారు ఏ పంటలు పండిస్తున్నారో లెక్కలు తీయడం లేదు. ఉచిత విద్యుత్ పొందుతున్న వారిలో ఎందరు పంటలు పండిస్తున్నారు.. ఏ పంటలు పండిస్తున్నారు..అన్న లెక్కలు కూడా లేవు. కొందరు ఇతరత్రా పనులకు ఉచిత విద్యుత్‌ను ఉపయోగిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. నిజానికి ఉచిత విద్యుత్‌ను కూడా లెక్కగట్టి ఇవ్వాలి.

ఏ పంట పండిస్తారో చూడాలి. ప్రజలు పన్నుల రూపంలో కట్టిన డబ్బులతో విద్యుత్ కొని ఇస్తున్నప్పుడు దానికి లెక్కా పత్రం ఉండాలి. ప్రజలను ఆదుకోవడం వేరు..ఓటు బ్యాంక్ రాజకీయాల కోసం పథకాలను అమలు చేయడం ద్వారా తమను తాము గప్ప పాలకులుగా భావిస్తున్నారు. ఇప్పుడు ఖర్చు పెడుతున్న ప్రతిపైసా వీరి జేబులోంచి తీయడం లేదు. కనీసం ఒక్క రూపాయి కూడా ఇందులో కలపడంలేదు. రైతుభరోసా కావచ్చు...రుణమాఫీ కావచ్చు...ఇతర పథకాలు కావచ్చు.. దుబారాను అరికట్టాలి. దూరదృష్టి లేకుండా పథకాల పేరుతో దుబారా చేస్తే నష్టపోయేది రాష్ట్రప్రజలే అని గుర్తించాలి. రూపాయికే కిలో బియ్యం అన్నది అర్థం లేని పథకంగా ఇప్పటికే గుర్తించాల్సింది. అయినా దానిని సమీక్షించడం లేదు. ఇలాంటి పథకాలు గుదిబండగా మారుతున్నాయి. ఓ రకంగా చెప్పాలంటే దళారీలకు దందాలు చేసే పథకంగా మారింది. ఇలాంటి పథకాల వల్ల ఆర్థిక దుర్భర పరిస్థితులు ఎదుర్కోవాల్సి వచ్చే ప్రమాదం రాకుండా చూసుకోవాలి. ముఖ్యంగా ఉభయ తెలుగు రాష్ట్ర వల్లభులు దీనిపై పాఠాలు నేర్చుకోవాలి. జీతాలకు ఇవ్వలేక, అభివృద్ధి పనులు చేపట్టలేక, ఉన్నది ఉచితంగా దోచిపెడుతూ తామేదో ఘనకార్యం చేస్తున్నామనుకుంటున్న కాంగ్రెస్, కూటమి పాలకులు కళ్లు తెరవాలి. పథకాల కోసం కొత్తగా డబ్బుల వేట మొదలు పెట్టడం, అప్పులు చేయడం సరైనపని కాదని గుర్తించాలి. ఉన్న అప్పులను తీర్చడమెలా అన్నది పక్కన పెట్టి కొత్త అప్పులు చేయడమెలా అన్నదానిపైనా పాలకులు దృష్టి పెట్టడం దారుణం కాక మరోటి కాదు. పాలన అంటే పంచిపెట్టడం కాదని గుర్తించాలి.

నగదు బదిలీలతో ప్రజలను మచ్చిక చేసుకుని ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తూ అధికారాన్ని గుప్పిట్లో ఉంచుకుని చేస్తున్న యత్నాలు విరమించుకోవాలి. ఉచిత పథకాలపై నెత్తీనోరు మొత్తుకుంటున్నా ఇద్దరు సిఎంలు వాటిని ఆపాలని ప్రయత్నించడం లేదు సరికదా అదేదో మహత్కార్యం చేసినట్లుగా ప్రకటనలు చేస్తున్నారు. ఇంకా ఆలస్యం చేయకుండా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఉచిత పథకాలపై కత్తెర వేయాలి. డబ్బుల పంపిణీని ఆపాలి. మరీ ముఖ్యంగా దుబారా పథకాలపై సమీక్షించాలి. ఇబ్బడి ముబ్బడిగా పోటీపడి కొనసాగిస్తున్న ఉచిత పథకాలను రద్దు చేయాలి. రైతుబంధు, రైతుల రుణ మాఫీలు, ఉచిత్ గొర్రెల పథకం, దళితబంధు వంటి పథకాల కారణంగా తెలంగాన అప్పుల్లో కూరుకుపోయింది. వీటిగురించి గొప్పలు చెప్పడం మానుకోవాలి. పథకాలు ఎంతమంచివైనా అర్హులకు సాయం అందించడంలో తప్పు లేదు. కానీ దుబారా పథకాలను కొనసాగిస్తే ప్రజలు ఊరికే వచ్చిన వాటిని తింటారు.

తరవాత తిట్టడానికి కూడా వెనకాడరు. విపక్షాలు కూడా ఈ పథకాలపై చర్చించి దుబారాను అరికట్టాలని కోరాలి. లేకుంటే వారు కూడా ఇందుకు బాధ్యతులు కాగలరు. రూపాయికి కిలో సన్న బియ్యం, ఉచిత విద్యుత్, రైతుభరోసా, ఉచిత బస్సు వంటి పథకాలు ఇలా ఒక్కోటి చెప్పుకుంటూ పోతే..ఒక్కో పథకంలో ఎంతమంది పేదలు, అందులో అర్హులు ఉన్నారో లెక్క గట్టాలి. ప్రచారార్భాటాలు కాకుండా ప్రజలు తమంతగా తాము బాగుపడ్డామని చెప్పగలిగినప్పుడే సుపరి పాలన అందించిన వారం అవుతాం. 78 ఏళ్ల స్వాతంత్ర్యం తరవాత కూడా ఇంకా పేదలు అంటూ పాలన చేయడం సరికాదు. ప్రజల కష్టాలను కొంతయినా తగ్గించగలిగే నిర్ణయాలు మాత్రమే కావాలి. ప్రజలకు నేరుగా డబ్బులు పందేరం అన్నది వారిని సోమరులను తయారు చేసే ప్రయత్నం మాత్రమే కాగలదు. బంగారు పళ్లెంలో అన్నం పెట్టాలని ఎవరూ కోరుకోవడం లేదు. అన్నం తినగలిగేలా, గౌరవంగా బతికేలా వారి జీవితాలకు అడ్డం పడకుండా నిర్ణయాలు తీసకుంటే అదే మేలు. అప్పుడే ప్రజలు స్వాగతిస్తారు. ఎసి గదుల్లో కూర్చుని నిర్ణయాలు చేయడం..అవి ప్రజలకు చేరుతున్నాయో లేదో గమనించకపోవడం కాదు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే విధంగా చేసేందుకు అవసరమైన కఠిన నిర్ణయాలు తీసుకుంటే మంచిది. అంతేగానీ కులాలు,మతాలు పేరుతో విభజించి పథకాలు అమలు చేయడం సరికాదు.

# సెకన్ పాటు ఆగిపోయిన ఇంధన స్విచ్‌లు

- ప్రమాదం వెనుక ఎలాంటి కుట్రకోణం లేదు
- పక్షి ఢీకొన్న ఆనవాళ్లు అసలే లేవు
- ఎయిరిండియా ప్రమాదంపై 15పేజీల ప్రాథమిక నివేదిక



**న్యూఢిల్లీ, జూలై 12 :** అహ్మదాబాద్‌లో ఎయిర్ ఇండియా విమాన ప్రమాదం పై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో ప్రాథమిక నివేదిక విడుదల చేసింది. మొత్తం 15 పేజీలతో ప్రాథమిక నివేదికలో కీలక విషయాలు వెల్లడించింది. విమానం టేకాఫ్ అయ్యాక ఇంధన కంట్రోలర్ స్విచ్‌లు సెకన్ పాటు ఆగిపోయినట్లు వెల్లడించింది. ఈ ప్రమాదం వెనుక ఎలాంటి కుట్ర కోణం లేదని తెలిపింది. పక్షి ఢీకొన్న ఆనవాళ్లు కూడా కన్పించలేదని నివేదికలో తెలిపింది. 'విమానం ప్రయాణించిన మార్గానికి సమీపంలో పక్షులు ఎగరలేదు. పక్షి ఢీ కొన్న ఆనవాళ్లు కూడా గుర్తించలేదు. వాతావరణ సంబంధిత సమస్యలు కూడా లేవు. ఆకాశం కూడా క్లియర్‌గా ఉంది. విజిబిలిటీ బాగుంది. గాలి స్వల్పంగా వీస్తోందని తెలిపింది. అంతేకాదు, ప్రమాదం వెనుక ఎలాంటి కుట్ర కోణం లేదని తెలిపింది. విమానంపై దాడి జరిగినట్లు- చెప్పేందుకు ఎలాంటి ఆధారాలూ కనిపించలేదని వివరించింది. జూన్ 12న మధ్యాహ్నం 1:30 గంటల సమయంలో గుజరాత్‌లోని అహ్మదాబాద్ నుంచి లండన్ బయల్దేరిన ఎయిర్ ఇండియా బోయింగ్ డ్రీమ్‌లైనర్ 787-8 విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కూలిపోయిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో 270 మంది మరణించారు. దుర్ఘటన జరిగి శనివారానికి సరిగ్గా నెల రోజులైంది. దీంతో ఇవాళ తెల్లవారుజామున ఈ ప్రమాద ఘటనపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో ప్రాథమిక నివేదిక విడుదల చేసింది. మొత్తం 15 పేజీలతో ప్రాథమిక నివేదికలో కీలక విషయాలు వెల్లడించింది. పైలట్ ఎందుకు స్విచ్ ఆఫ్ చేసినట్లు- మరో పైలట్‌ను ప్రశ్నించాడని, తాను స్విచ్ ఆఫ్ చేయలేదని మరో పైలట్ సమాధానం ఇచ్చాడని నివేదికలో పేర్కొంది. కాక్‌పిట్‌లో ఇవే పైలట్ల ఆఖరి మాటలని తెలిపింది. తర్వాత పైలట్లు మేడేకాల్ ఇచ్చారని, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ స్పందించినప్పటికీ ఎలాంటి స్పందన రాలేదని వెల్లడించింది. ఈలోపే విమానం కూలిపోయిందని పేర్కొంది. విమానం టేకాఫ్ అయ్యాక సెకన్ల వ్యవధిలో ఇంధన కంట్రోల్ స్విచ్‌లు ఆగిపోయినట్లు వెల్లడించింది. ఆ స్విచ్ ఎందుకు ఆఫ్ చేశావని ఒక పైలట్.. మరో పైలట్‌ను ప్రశ్నించా డని రిపోర్ట్‌లో పేర్కొంది. తాను స్విచ్ ఆఫ్ చేయలేదని మరో పైలట్ సమాధానం ఇచ్చినట్లు తెలిపింది. కాక్‌పిట్‌లో ఇవే పైలట్ల ఆఖరి మాటలని ఏఏఐబీ తెలిపింది.ఈ రెండు స్విచ్‌లు ఒక సెకను తేడాతో ఒకదాని తర్వాత మరొకటి ఆగినట్లు నివేదికలో తెలిపింది. ప్రమాదానికి ముందు విమానం కేవలం 32 సెకన్ల పాటు గాల్లో ఉన్నట్లు వెల్లడించింది. రన్‌వేకు కేవలం 0.9 నాటిక ల్ మైళ్ల దూరంలోని ఓ హాస్టల్ భవంతిపై విమానం కూలిపో యిందని నివేదిక వివరించింది. ఇంజిన్లు శక్తిని కోల్పోయిన తర్వాత ర్యామ్ ఎయిర్ టర్బైన్‌ను యాక్టివేట్ చేసినట్లు గుర్తించా రు. ఇది యాక్టివేట్ అయినట్లు సీసీటీవీ దృశ్యాల్లో కన్పించిందని ఏఏఐబీ తమ నివేదికలో వెల్లడించింది. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ స్పందించినప్పటికీ ఎలాంటి స్పందన రాలేదన్న ఏఏఐబీ, ఈలోపే విమానం కూలిపోయిందని వివరణ ఇచ్చింది. ప్రమాదానికి సంబంధించిన ఫొటోలు, వీడియోల పరిశీలన పూర్తి చేసినట్లు చెప్పింది. విమానానికి సంబంధించి రెండు ఇంజిన్లను వెలికితీసినట్లు, తదుపరి పరీక్షలకు కాంపోనెంట్స్‌ను గుర్తించామని పేర్కొంది. ఇంజిన్లను భద్రపరిచినట్లు తెలిపింది. ప్రమాదానికి ముందు ఇంధనం, బరువు సైతం పరిమితుల్లోనే ఉన్నాయని, విమానంలో ప్రమాదకరమైన వస్తువులు ఏవీ లేవని తన నివేదికలో స్పష్టం చేసింది. విమానంలో ఇంధనం కూడా స్వచ్ఛంగానే ఉందని, కలుషితమైన ఆనవాళ్లు లేవని తెలిపింది.

# బిసిలను మరోమారు మోసం చేస్తున్న రేవంత్

- రాష్ట్రపతి వద్ద బిల్లు పెండింగ్‌లో ఉండగా ఆర్డినెన్స్ చెల్లదు
- ఎన్నికలు త్వరగా ముగించాలనే ఆర్డినెన్స్ ప్రతిపాదన
- బిజెపి ఎంపి లక్ష్మణ్ విమర్శలు



**న్యూఢిల్లీ, జూలై 12:** బీసీలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరోసారి మోసం చేస్తున్నారని బీజేపీ రాజ్యసభ సభ్యులు డాక్టర్ కే. లక్ష్మణ్ ఆరోపించారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు రేవంత్‌రెడ్డి మంత్రివర్గంలో తీర్మానం చేయడం అంటే బీసీలను మరోసారి మోసగించడమేనని విమర్శించారు. శనివారం ఢిల్లీలో లక్ష్మణ్ మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం పంపించిన బిల్లు రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్నప్పటికీ ఆ బిల్లుపై ఏమి తేల్చకుండా ఆర్డినెన్స్ తీసుకురావడంలో ఉన్న మతలబు ఏంటని ప్రశ్నించారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన వాగ్దానాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు నిలపెట్టుకోవడం లేదని ప్రశ్నించారు. ఇప్పటి వరకు నిర్వహించిన అసెంబ్లీ సమావేశాల్లో బీసీ డిక్లరేషన్‌కు సంబంధించిన కనీస ప్రస్తావన ఎందుకు చేయలేదని నిలదీశారు. సెప్టెంబర్‌లోపు బీసీ రిజర్వేషన్లను తేల్చాలని తెలంగాణ హై కోర్టు ఆదేశించిందని.. కాబట్టే ఎన్నికలు త్వరగా నిర్వహించి మరోసారి బీసీలని మోసం చేయడానికే రేవంత్‌రెడ్డి సర్కార్ సిద్ధమవుతోందని విమర్శించారు. రాష్ట్రపతి దగ్గర 42శాతం రిజర్వేషన్‌లకు సంబంధించిన బిల్లు పెండింగ్‌లో ఉన్నప్పుడు ఆర్డినెన్స్ తీసుకువస్తే.. ఆ బిల్లుకి గవర్నర్ ఎలా ఆమోదం తెలుపుతారని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి సర్కార్‌కి కనీస ఇంగిత జ్ఞానం లేదని, బీసీల జీవితాలతో చెలగాటం ఆడుతూ వారిని రాజకీయ అస్త్రాలుగా మార్చుకునే ప్రయత్నం చేస్తోందని లక్ష్మణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసి పూర్తి స్వేచ్ఛ ఆయా రాష్ట్రాలకు ఉందని నొక్కిచెప్పారు. రిజర్వేషన్లు కల్పించేందుకు ఒక ప్రత్యేక కమిషన్ ఏర్పాటు- చేసి రాష్ట్రంలో ఏ కులానికి సంబంధించిన జనాభా ఎంత ఉందో లెక్కలు తెలిస్తే న్యాయస్థానాల్లో వాదన నిలబడే అవకాశం ఉందని చెప్పుకొచ్చారు. రిజర్వేషన్లలో వివిధ కులాలకు సంబంధించిన గణాంకాలను రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు బయట పెట్టడం లేదని నిలదీశారు. కులాలకు సంబంధించిన జనాభా ప్రామాణిక గణాంకాలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేస్తే కోర్టులో రాష్ట్ర ప్రభుత్వ వాదన నిలబడే అవకాశం ఉందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు- చేసిన బుర్ర వెంకటేశం ఆధ్వర్యంలో కమిషన్ బాధ్యతలను ఎందుకు సరిగ్గా నిర్వర్తించలేదని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వివిధ కులాలకు సంబంధించిన ప్రామాణిక గణాంకాలు వెంటనే విడుదల చేయాలని లక్ష్మణ్ డిమాండ్ చేశారు. 2021లో వికాస్ కిషన్‌రావు వర్సెస్ మహారాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన కేసులో స్థానిక సంస్థల రిజర్వేషన్లకు సంబంధించి సుప్రీంకోర్టు మార్గదర్శకాలు స్పష్టంగా ఉన్నాయని చెప్పుకొచ్చారు. ఎస్సీ, ఎస్టీలతో పాటు- బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కేటాయించినప్పుడు 50 శాతానికి మించకూడదనే నిబంధనను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పాటించిందా అని నిలదీశారు. బీఆర్ఎస్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలు రిజర్వేషన్ల పేరుతో బీసీలను గతంలో వంచించాయని మండిపడ్డారు. ఇప్పుడు ఇదేవిధంగా రేవంత్‌రెడ్డి బీసీలను దగా చేసి ఓట్లు- దండుకొనే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.





# ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ

## కేంద్ర ఎన్నికల కమిషన్ పరిశీలన

**న్యూఢిల్లీ, జూలై 12 :** ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై కేంద్ర ఎన్నికల కమిషన్ కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ చేపట్టనున్నట్లు కేంద్ర ఎన్నికల కమిషన్ అధికారులు తెలిపారు. ఆగస్టులో ఓటర్ల జాబితా సవరణని ప్రారంభించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం సన్నాహాలు చేస్తోంది. బీహార్ ఎన్నికల నేపథ్యంలో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై ఇప్పటికే పెద్ద ఎత్తున విమర్శలు, ఆరోపణలు వస్తున్నాయి. ప్రత్యేక సవరణకు గ్రీన్‌సిగ్నల్ ఇస్తూనే ఈసీకి సుప్రీంకోర్టు కొన్ని సూచనలు చేసింది. బీహార్ తర్వాత అసెంబ్లీ ఎన్నికలు జరిగే పశ్చిమబెంగాల్, తమిళనాడు తదితర రాష్ట్రాల్లోనూ ఇదే పక్రియను చేపట్టనుందని ప్రచారం జరుగుతోంది. ఎన్నికలు జరిగే రాష్ట్రాల్రే కాకుండా దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణకు సిద్ధమవుతున్నట్లు కేంద్ర ఎన్నికల కమిషన్ అధికారు లు వెల్లడించారు. ఇందుకు సంబంధించి ఆయా రాష్ట్రాల ఎన్నికల సంఘం అధికారులకు ఇప్పటికే సమా చారం ఇచ్చినట్లు ఈసీ అధికారులు తెలిపారు. పూర్తిస్థాయి షెడ్యూల్‌ని త్వరలోనే కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించే అవకాశాలు ఉన్నాయి.

# లెక్చరర్ లైంగిక వేధింపులు..

## కాలేజీలోనే నిప్పంటించుకున్న విద్యార్థిని



**ఒడిశా :** ఒడిశాలో దారుణం చోటుచేసుకుంది. ఓ అధ్యాపకుడి లైంగిక వేధింపులు తాళలేక విద్యార్థిని ఆత్మహత్యకు యత్నించింది. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు తీసుకోకపోవడంతో.. తీవ్ర మనస్తాపానికి గురయ్యింది. న్యాయం జరగడం లేదనే ఆవేదనతో కాలేజీ ప్రాంగణంలోనే ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకుంది. 90 శాతం కాలిన గాయాలతో చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతోంది. ఆమెను కాపాడేందుకు యత్నించిన తోటి విద్యార్థి సైతం తీవ్రంగా గాయపడ్డాడు. బాలేశ్వర్‌లోని ఫకీర్ మోహన్ కాలేజీలో ఓ విద్యార్థిని ఇంటిగ్రేటెడ్ బీఈడీ రెండో సంవత్సరం చదువుతోంది. ఓ విభాగాధిపతి సదరు విద్యార్థినిని కొన్ని రోజులుగా లైంగికంగా వేధిస్తున్నాడు. తనమాట వినకుంటే భవిష్యత్తు నాశనం చేస్తానని బెదిరించసాగాడు. ఇవి భరించలేని ఆ విద్యార్థిని జూన్ 30న కాలేజీ యాజమాన్యానికి ఫిర్యాదు చేసింది. వారంలో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదు. వేధింపులకు గురిచేస్తున్న అధ్యాపకుడిని రక్షించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించిన బాధిత విద్యార్థిని.. తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ గత వారం రోజులుగా కాలేజీ క్యాంపస్‌లో నిరసన చేపట్టింది. శనివారం ఉదయం కూడా తోటి విద్యార్థులతో కలిసి కాలేజీ ముందు ఆందోళనకు దిగింది. అదే సమయంలో ప్రిన్సిపల్ కార్యాలయానికి ఒక్కసారిగా పరుగెత్తిన ఆమె.. ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకుంది. హాహాకారాలతో పరుగెత్తుతుండగా తోటి విద్యార్థులు ఆమెను రక్షించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో మరో విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే బాధితులను ఆసుపత్రికి తరలించారు. ఇద్దరి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. లైంగిక వేధింపులకు సంబంధించి విద్యార్థిని ఫిర్యాదు చేసిందని, దీనిపై అంతర్గత కమిటీ దర్యాప్తు చేపడుతోందని కాలేజీ ప్రిన్సిపల్ వెల్లడించారు. శనివారం ఉదయం కూడా ఇదే విషయంపై బాధిత విద్యార్థిని తనను కలిసి మాట్లాడిందన్నారు. మరోవైపు ఈ వ్యవహారంపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. హెచ్‌వోడీని అదుపులోకి తీసుకున్నారు. తాజా పరిణామంతో కాలేజీ క్యాంపస్‌లో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.



# బెంగళూరులో తొక్కిసలాట ఘటన వారిదే బాధ్యత

**బెంగళూరు :** ఆర్సీబీ విజయోత్సవాల వేళ బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాట ఘటన తీవ్ర విమర్శలకు దారితీసిన సంగతి తెలిసిందే. కర్ణాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థ డీఎన్ఏ ఎంటర్‌టైన్‌మెంట్, బెంగళూరు పోలీసులదే బాధ్యత అని జ్యుడీషియల్ కమిషన్ ఇచ్చిన నివేదిక పేర్కొంది. దానిని ఇప్పటికే సీఎం సిద్ధరామయ్యకు సమర్పించారు. విశ్రాంత న్యాయమూర్తి జాన్ మైఖెల్ డికున్హా నేతృత్వంలోని కమిషన్ పలు లోపాలను గుర్తించింది. ఈవెంట్‌ను నిర్వహించడం కష్టమని వారికి ముందే తెలుసని వెల్లడించింది. విధి నిర్వహణలో పూర్తి నిర్లక్ష్యం కనిపించిందని తెలిపింది. గత నెల చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాటలో 11 మంది మృతి చెందగా.. 50 మందికి పైగా గాయపడిన ఘటన విషాదం రేపిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కర్ణాటక ప్రభుత్వం జ్యుడీషియల్ కమిషన్‌ను ఏర్పాటుచేసింది. విచారణలో భాగంగా ఘటనతో సంబంధం ఉన్న ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించింది. పలువురు ప్రత్యక్ష సాక్షులు, క్రికెట్ సంఘం అధికారులు, పోలీస్ అధికారుల వాంగ్మూలాలు రికార్డు చేసింది. ఆ ఆర్సీబీ విజయోత్సవ ఈవెంట్‌లో భాగంగా తీవ్ర భద్రతా వైఫల్యం కనిపించిందని గుర్తించింది. స్టేడియం లోపల కేవలం 79 మంది పోలీసులను మాత్రమే మోహరించారని, ఇక బయట ఎవరూ లేరని పేర్కొంది. ఘటనా స్థలం వద్ద అంబులెన్స్‌లు కూడా లేవని చెప్పింది. అలాగే పోలీసు యంత్రాంగం వైఫల్యం స్పష్టంగా ఉందని నివేదికలో కమిషన్ వెల్లడించింది. ఘటన జరిగిన తర్వాత జాయింట్ కమిషనర్ సాయంత్రం నాలుగు గంటలకు వచ్చారని, 5.30గంటల తర్వాతే పోలీస్ కమిషనర్‌కు ఈ విషయంపై సమాచారం ఇచ్చారంది. ప్రస్తుతం సిద్ధరామయ్య వద్దకు చేరిన ఈ నివేదికను జులై 17న రాష్ట్ర క్యాబినెట్ ముందుకు తీసుకువచ్చే అవకాశాలు ఉన్నాయి. కాగా.. ఇప్పటికే ఆర్సీబీ, కర్ణాటక క్రికెట్ బోర్డు, ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థపై పలు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. కర్ణాటక హైకోర్టు కూడా ఈ కేసును విచారిస్తోంది.

# రూ.60 లక్షల బీమా డబ్బుల కోసం అత్తను అల్లుడే హత్య చేయించి..

**సిద్దిపేట :** సిద్దిపేట జిల్లా తొగుట మండలం పెద్దమాసాన్‌పల్లి శివారులో ఇటీవల చోటుచేసుకున్న కారు ప్రమాదం కేసును పోలీసులు ఛేదించారు. ఆ ఘటనలో ఓ మహిళ మృతిచెందిన సంగతి తెలిసిందే. అయితే, అది ప్రమాదం కాదని, సుపారీ హత్య అని తేల్చారు. ప్రమాద బీమా వస్తుందని ఆమెను అల్లుడే చంపించినట్లు గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 7న పెద్దమాసాన్‌పల్లి శివారులో కారు ఢీకొని రామవ్వ (60) అనే మహిళ మృతి చెందింది. ఘటన జరిగిన రోజు ఆమె అల్లుడు వెంకటేశ్ యాక్సిడెంట్‌గా ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో భాగంగా రూ.60 లక్షల ప్రమాద బీమా డబ్బుల కోసం అల్లుడే ఆమెను హత్య చేయించినట్లు నిర్ధరణ అయ్యింది. "వెంకటేశ్ గతంలో అత్త రామవ్వ మీద పలు రకాల బీమాలు చేయించాడు. ఈ క్రమంలోనే ఇన్సూరెన్స్ డబ్బుల కోసం ఆమెను కారుతో ఢీకొట్టి చంపేలా కరుణాకర్ అనే వ్యక్తితో ఒప్పందం చేసుకున్నాడు. బీమా సొమ్ములో సగం ఇస్తానని అతడికి ఆశ జూపాడు. పొలం పనులు ఉన్నాయని చెప్పి ఊరి నుంచి అత్తను తీసుకొచ్చాడు. ఈ నెల 7న రాత్రివేళ పొలం నుంచి ఆమెను ఒంటరిగా ఇంటికి పంపించాడు. నడుచుకుంటూ వెళ్తున్న ఆమెను పథకం ప్రకారం కారుతో ఢీకొట్టించి హత్య చేయించాడు. దీని కోసం అద్దె కారును తీసుకెళ్లి కరుణాకర్‌కు ఇచ్చాడు" అని పోలీసులు వెల్లడించారు. సీసీ కెమెరా ఫుటేజీల ఆధారంగా కారును, డ్రైవర్‌ను గుర్తించామని తెలిపారు. అల్లుడే ఈ హత్య చేయించాడని కరుణాకర్ విచారణలో అంగీకరించినట్లు చెప్పారు.

నేడు www.nedudailynews.com జనరల్ General ఆదివారం 13 జూలై 2025




## మేరు సంఘం ఆధ్వర్యంలో అఖండ హరినామ సప్త

**కామారెడ్డి జిల్లా, జులై 12 నేడు న్యూస్ బ్యూరో :** బాన్సువాడ మండల కేంద్రంలో మేరు సంఘం ఆధ్వర్యంలో శనివారం రోజున అఖండ హరినామ సప్త కార్యక్రమా కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం ఈనెల 17. 07. 2025 నుండి 23.07. 2025 వరకు కొనసాగుతుందని సంఘం అధ్యక్షుడు వేటూరి హనుమాన్లు తెలిపారు. కావున ఇట్టి కార్యక్రమాన్ని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



## దివిటి లక్ష్మికాంత్ జ్ఞాపకార్థం అనాథ వృద్ధాశ్రమంలో అన్నదానం

**కామారెడ్డి జిల్లా, జులై 12, నేడు న్యూస్ బ్యూరో :** బాన్సువాడ మండలం మండలానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు ఉదార స్వభావుడు, స్నేహశీలి, సంఘ సంస్కర్త కీర్తిశేషులు దివిటి లక్ష్మికాంత్ జ్ఞాపకార్థం శనివారం నిజామాబాద్ జిల్లా మోస్రా మండలం చింతకుంట గ్రామంలో గల ఉచిత అనాథ వృద్ధాశ్రమంలోని పేదవారికి కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వృద్దులకు టవల్లా పంపిణీ చేశారు. అనంతరం దివిటి లక్ష్మికాంత్ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో స్థానిక సంఘ సంస్కర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.




## దుబ్బాక ఎస్ఐని సన్మానించిన అఖిల రాజ్ పౌండేషన్ బృందం

**నేడు న్యూస్, దుబ్బాక ప్రతినిధి :** దుబ్బాక ఎస్ఐ గా బాధ్యతలు స్వీకరించిన కీర్తి రాజును శనివారం అఖిల రాజ్ పౌండేషన్ బృందం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి మెమోంటో అందజేసి శాలువాతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో అఖిల రాజ్ పౌండేషన్ బృందం ఇనుప రవి, బీమరి రాజు, బాలశేఖర్, కంకణాల చంద్రం, విజయ్,మహేష్,అహోబిలం వెంకటేశ్వర్లు,జోగు సాగర్ అనిల్,స్వామి, పలువురు ఉన్నారు.



## రేగా నరసమ్మకు నివాళులర్పించిన దిండిగాల, రంగనాథ్

**ఇల్లందు, నేడు న్యూస్ :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రేగా కాంతరావు మాతృమూర్తి రేగా నర్సమ్మ ఇటీవల మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపక సభ్యులు,మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ ఉమ్మడి ఖమ్మం జిల్లా మాజీ అధ్యక్షులు దిండిగాల రాజేందర్, టిబిజికెఎస్ జనరల్ సెక్రటరీ ఎస్.రంగనాథ్ రేగా కాంతారావు ఇంటికి వెళ్లి వారి మాతృమూర్తి రేగా నరసమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇల్లందు మున్సిపల్ మాజీ వార్డు కౌన్సిలర్ జెకె.శ్రీను, ఆత్మ కమిటీ చైర్మన్ మాజీ బావ్ సింగ్,కో-ఆప్షన్ మెంబర్ ఘాజీ బాబా,జబ్బార్, వీరస్వామి,చాంద్ పాషా,యువజన నాయకులు లలిత్ కుమార్ పాసి, వసంత్, సుందరగిరి శ్రీను, ఉపేందర్, సనా రాజేష్,శివ, ఎడ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.



## గొగ్గెల మంగమ్మకు ఘన నివాళులు

**ఇల్లందు/టేకులపల్లి, నేడున్యూస్:** బేతంపూడి గ్రామం టేకులపల్లి మండలం లో బీజేపీ గిరిజన మూర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి గొగ్గెల వెంకటేశ్వర్లు తల్లి గొగ్గెల మంగమ్మ దశ దిన కర్మ కార్యక్రమానికి హాజరై ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసిన బీజేపీ టీచర్స్ సెల్ జిల్లా కన్వీనర్ వి. హాథీరామ్ నాయక్ మండల అధ్యక్షులు తేజవత్ శంభు నాయక్,జిల్లా నాయకులు దరావత్ బాలాజీ నాయక్, మండల నాయకులు జామాల్ అప్పారావు, దరావత్ బాల, రామదాసు,భుక్య శ్రీను, హరి పాల్గొన్నారు.

# సొమ్ము ఎస్ఆర్‌హెచ్‌ది.. సోకు హెచ్‌సీఏది

- సొమ్ము ఎస్ఆర్‌హెచ్‌ది.. సోకు హెచ్‌సీఏది
- నిధుల స్వాహాకు జగన్‌మోహన్‌రావు బృందం కుయుక్తులు
- రూ.వందల కోట్ల లెక్క తేల్చేందుకు సీఐడీ కార్యాచరణ



**హైదరాబాద్:** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ)లో అక్రమాలపై సీఐడీ దర్యాప్తులో కీలకాంశాలు వెలుగుచూస్తున్నాయి. ఉప్పల్ క్రికెట్ స్టేడియంలో ఐపీఎల్ మ్యాచ్‌ల నిర్వహణ కోసం సన్‌రైజర్స్ హైదరాబాద్(ఎస్ఆర్‌హెచ్) చేపట్టిన పనుల్ని.. హెచ్‌సీఏ చేసినట్లుగా చూపి రూ.కోట్లు దారిమళ్లించినట్లు తేలింది. ఈ క్రమంలో ఇతర నిందితులతో కలిసి హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు బృందం పన్నిన కుయుక్తుల్ని సీఐడీ గుర్తించింది. స్టేడియంలో నల్లాలు, వాష్ బేసిన్లు, కమోడ్స్ మరమ్మతులు, కొనుగోలుకు ఎస్ఆర్‌హెచ్ ఐపీఎల్ సీజన్-17లో రూ.37.76 లక్షలు, సీజన్-18లో రూ.5.9 లక్షలు వెచ్చించి పనులు చేయించింది. ఇవే పనుల కోసం తాము రూ.20.69 లక్షలు, రూ.1.01 లక్షల చొప్పున వెచ్చించినట్లు చూపడం ద్వారా నిందితులు నిధులు కాజేసినట్లు బహిర్గతమైంది.

ఐపీఎల్-18 సీజన్‌కు సంబంధించి స్టేడియంలో ఏసీలను సమకూర్చేందుకు పయనీర్ సొల్యూషన్స్ సంస్థకు మార్కెట్ ధర కన్నా రూ.12,00,89 అదనంగా చెల్లించినట్లు తేలింది. ఇదే సీజన్‌లో రూ.1.03 కోట్లతో క్రికెట్ బంతులు, రూ.6.85 లక్షలతో విద్యుత్తు సామగ్రి, రూ.56.84 లక్షలతో క్రీడాకారుల దుస్తులు కొన్నట్లు చూపి నిధులను దారిమళ్లించినట్లు సీఐడీ నిర్ధారించింది. హెచ్‌సీఏకు బీసీసీఐతోపాటు ఇతర ఆదాయ మార్గాల ద్వారా ఏటా రూ.100 కోట్ల వరకు సమకూరుతున్నట్లు తెలుస్తున్న నేపథ్యంలో మరింత లోతుగా దర్యాప్తు చేసేందుకు సిద్ధమైంది. నిందితులను కస్టడీకి తీసుకొని విచారించనుంది.

### కృష్ణయాదవ్‌కు తెలియకుండానే.. ఆయన్నే అధ్యక్షుడిగా చూపి..

2023 అక్టోబరు 20న జరిగిన హెచ్‌సీఏ ఎన్నికల్లో అధ్యక్షుడిగా గెలిచిన జగన్‌మోహన్‌రావు.. ఎన్నికల్లో పోటీ చేసే అర్హత కోసం పన్నిన కుయుక్తులు బహిర్గతమవుతున్నాయి. సీఐడీ దర్యాప్తులో తేలిన అంశాల మేరకు.. గౌలిపురా క్రికెట్ క్లబ్ అధ్యక్షుడు, మాజీ మంత్రి సి.కృష్ణయాదవ్‌కు తెలియకుండానే 2016 అక్టోబరు 21న ఎర్రగడ్డ రిజిస్ట్రార్ ఆఫ్ సొసైటీస్ కార్యాలయంలో ఆయన్నే అధ్యక్షుడిగా పేర్కొంటూ శ్రీచక్ర క్రికెట్ క్లబ్‌ను రిజిస్ట్రేషన్ చేయించారు. గౌలిపురా క్రికెట్ క్లబ్ పేరును శ్రీచక్ర క్రికెట్ క్లబ్‌గా మార్చినట్లు చూపించారు. అప్పటినుంచి కృష్ణయాదవ్ తరచూ సర్వసభ్య సమావేశాలు నిర్వహించినట్లు ఫోర్జరీ పత్రాలు సృష్టించి ఆ కార్యాలయంలో సమర్పించారు.

**శ్రీచక్ర క్లబ్‌లో అడ్డదారిలో సభ్యత్వం పొందేందుకు...** కార్యవర్గంలో మార్పులు చేర్పులు చేసినట్లు 2023 సెప్టెంబరు 17న రిజిస్ట్రేషన్ కార్యాలయానికి ప్రొసీడింగ్స్ పంపించారు. కృష్ణయాదవ్ స్థానంలో జి.కవితను అధ్యక్షురాలిగా, సి.శివకుమార్‌యాదవ్ స్థానంలో కోశాధికారిగా జగన్‌మోహన్ రావును మార్చినట్లు పేర్కొన్నారు. శ్రీచక్ర క్రికెట్ క్లబ్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లుగా చూపడం ద్వారా హెచ్‌సీఏ అధ్యక్ష ఎన్నికల్లో పోటీకి జగన్‌మోహన్‌రావు మార్గం సుగమం చేసుకున్నారు. గెలిచిన అనంతరం తన అనుచరులనే హెచ్‌సీఏ ఎపెక్స్ కౌన్సిల్ సభ్యులుగా చేసుకున్నారు. దేవరాజ్‌ను కార్యదర్శిగా, సీజే శ్రీనివాసరావును కోశాధికారిగా, సునీల్ కాంటేను సీఈవోగా నియమించుకుని... అడ్డగోలుగా అక్రమాలకు పాల్పడ్డారు. జగన్‌మోహన్‌రావు అడ్డదారిలో అధ్యక్షుడిగా ఎన్నికయ్యారనే ఫిర్యాదుపై హెచ్‌సీఏకు అంబుడ్స్‌మన్ అండ్ ఎథిక్స్ ఆఫీసర్‌గా పనిచేసిన జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డికి సీఐడీ అధికారులు లేఖ రాశారు. దీంతో గౌలిపురా క్రికెట్ క్లబ్ పేరును శ్రీచక్ర క్రికెట్ క్లబ్‌గా మార్చడం చెల్లదని ఈ నెల 7న సీఐడీకి రాసిన లేఖలో ఆయన స్పష్టం చేశారు.




## సాగు భూములను పేద రైతుల నుంచి లాక్కోవడం సరైనది కాదు

- చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు కొండ విశ్వేశ్వర్ రెడ్డి
- గోశాలను ఇతర ప్రదేశాల్లోకి తరలించండి
- ఈ విషయంపై త్వరలో ముఖ్యమంత్రికి విన్నవించడం జరుగుతుంది.
- ఎన్కేపల్లి భూ బాదితులకు అండగా ఉంటామని భరోసానిచ్చిన ఎంపీ



**మొయినాబాద్, నేడు న్యూస్:** జిల్లాలో అనేక ప్రభుత్వ భూములు ఉన్నాయని అక్కడికి గోశాలను తరలించాలని.. ఎన్కేపల్లిలోనే ఎందుకు ప్రభుత్వం ఏర్పాటు చేయలనుకుంటుందో అర్థం కావడం లేదని ఇదే విషయంపై త్వరలో సీఎం రేవంత్ రెడ్డిని కలిసి విన్నవించడం జరుగుతుందని చేవెళ్ల పార్లమెంటు సభ్యుడు కొండా విశ్వేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ఎన్కేపల్లిలోని సర్వే నంబర్ 180లోని 99 ఎకరాల 14 గుంటల ప్రభుత్వ స్థలంలో గోశాల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో అక్కడ సాగుచేసుకుంటున్న రైతులు వారం రోజుల నుంచి నిరసనలో కూర్చుకున్నారు.అయితే అప్పటి నుంచి మాజీ ఎమ్మెల్యే రత్నం, మొయినాబాద్ రూరల్, మున్సిపల్ బీజేపీ అధ్యక్షులు దారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, మాదాపురం శ్రీకాంత్ అధ్వర్యంలో ఎన్కేపల్లి రైతులకు బీజేపీ పార్టీ తరపున అండగా నిలుస్తూ మద్దతు ప్రకటిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం సాయంత్రం కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఎన్కేపల్లి గోశాల స్థలాన్ని పరిశీలించి అక్కడ నిరసన వ్యక్తం చేస్తున్న రైతులకు మద్దతు ప్రకటించారు.అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్కేపల్లిలో గోశాల ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. గోశాల ఏర్పాటుకు జిల్లాలో అనేక ప్రభుత్వ స్థలాలు ఉన్నాయని వాటిని కాకుండా ఎన్కేపల్లిలోని సాగు భూములను పేద రైతుల నుంచి లాక్కోవడం సరైనది కాదని అన్నారు. ఎన్కేపల్లి భూ బాదితులకు బీజేపీ పార్టీ అండగా ఉంటుందని న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తునే ఉంటామని పేర్కొన్నారు. ఇదే విషయంపై త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి పూర్తి వివరాలు వెల్లడించి ఎన్కేపల్లి రైతులకు న్యాయం చేసే విధంగా కృషి చేస్తానని రైతులకు భరోసానిచ్చారు. ఎన్కేపల్లిలోని ప్రభుత్వ స్థలం సాగుకు పనికివచ్చేదని దీనిని ప్రభుత్వం దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రత్నం, సీనియర్ నాయకులు ప్రభాకర్ రెడ్డి, మండల బీజేపీ పార్టీ అధ్యక్షుడు దారెడ్డి చంద్రశేఖరరెడ్డి, మాదాపురం శ్రీకాంత్, మోర నర్సింహ్మారెడ్డి, అత్తాపురం శ్రీనివాస్ గౌడ్, జెల్లెల రవియాదవ్, ప్రభాకర్ యాదవ్, రైతులు సికిందర్, డప్పు రమేష్, ఈశ్వర్, రైతులు పాల్గోన్నారు.



## రక్తదానం మరొకరికి ప్రాణదానం

- యువత ముందుకొచ్చి రక్తదానం చేయాలని సూచన
- ర్యాకం ఉదయ్ ని అభినందించిన స్వప్న కుటుంబీకులు

**నేడు న్యూస్, దుబ్బాక ప్రతినిధి :** అత్యవసర పరిస్థితుల్లో రక్త దానం మరొకరికి ప్రాణధానమని, యువత ముందుకు వచ్చి రక్త దానం ఇవ్వాలని ర్యాకం ఉదయ్ పిలుపునిచ్చారు. శనివారం సిద్దిపేట జిల్లా పీపుల్స్ హాస్పిటల్ లో పెద్దగుండవెల్లి గ్రామానికి చెందిన స్వప్న అనే( గర్భిణీ కి) ప్లేట్ లెట్స్ తక్కువ కావడంతో రక్తం కావాలని డాక్టర్లు సూచించారు. దీంతో ఈ విషయం తెలుసుకున్న రక్త ధాత సమూహకుడు ర్యాకం ఉదయ్ సిద్దిపేటలోని ప్రయివేట్ ఆస్పత్రికి వెళ్లి రక్త దానం చేసి ప్రాణాలు కాపాడారు.ఈ సందర్భంగా ర్యాకం ఉదయ్ ని స్వప్న కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు. కాగా వర్షాకాలం సీజన్లో ఉదయ్ నేటితో 6వ సారి రక్త దానం చేసి పలువురి నుండి ప్రశంసలు పొందారు.



## ఫైర్ అండ్ సేఫ్టీ కోర్సుల్లో శిక్షణ తరగతులు

### శిక్షణ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

**హైదరాబాద్, నేడు న్యూస్:** నేషనల్ సెంటర్ ఫర్ ఫైర్ అండ్ సేఫ్టీ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో నిర్వహించే కేంద్ర ప్రభుత్వ సంస్థ ఫైర్ సేఫ్టీ అండ్ ఇండస్ట్రియల్ సేఫ్టీ కోర్సులకు అర్హత, ఆసక్తి గల అభ్యర్థులనుండి ఆన్లైన్ లో దరఖాస్తులు చేసుకోవాలని నేషనల్ సెంటర్ ఫర్ ఫైర్ అండ్ సేఫ్టీ ఇంజనీరింగ్ హైదరాబాద్ సంచాలకులు ఏ. వెంకట్ రెడ్డి కోరారు. ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, ఇంజనీరింగ్ అభ్యర్థులు ఈ కోర్సులకు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని ఆయన తెలిపారు. కోర్సుల వివరాలు: డిప్లొమా ఇన్ ఫైర్ సేఫ్టీ ఇంజనీరింగ్, పీజీ డిప్లొమా ఇన్ ఫైర్ టెక్నాలజీ అండ్ ఇండస్ట్రియల్ సేఫ్టీ, సబ్ ఫైర్ ఆఫీసర్, పీజీ డిప్లొమా ఇన్ ఫైర్ సేఫ్టీ ఇంజనీరింగ్. డిప్లొమా ఇన్ ఫైర్ టెక్నాలజీ అండ్ ఇండస్ట్రియల్ సేఫ్టీ. కోర్సు పూర్తి చేసిన తర్వాత కేంద్ర ప్రభుత్వ సంస్థ సర్టిఫికెట్ ప్రదానం చేయబడునని ఆయన వెల్లడించారు. ఫైర్ సేఫ్టీ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులకు వివిధ పరిశ్రమలు, ఫ్యాక్టరీలు, నిర్మాణ రంగ సంస్థలు, ఎయిర్ పోర్ట్స్, పవర్ ప్లాంట్స్, హాస్పిటల్స్, ఆయిల్ అండ్ గ్యాస్ ఇండస్ట్రీస్, స్టార్ హోటల్స్, బిగ్ మాల్స్, ఫార్మాస్యూటికల్ ఇండస్ట్రీస్, మైనింగ్ సంస్థలలో ఫైర్ ఆఫీసర్, సేఫ్టీ ఆఫర్, సేఫ్టీ ఇంజనీర్, సేఫ్టీ సూపర్వైజర్, మేనేజర్, ఫైర్ మెన్, సెక్యూరిటీ మేనేజర్ వంటి పలు ఉపాధి అవకాశాలు ఉన్నాయని వివరించారు. ఈ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులకు విదేశాలలో అధిక వేతనాలతో ఉత్తమ ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. ఆన్ లైన్ లో అప్లై చేసుకునేందుకు వెబ్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని, అలాగే అడ్మిషన్స్ ఇతర వివరాల కొరకు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్: 6302355872 లో సంప్రదించాలని ఆయన కోరారు.



## సైబర్ సెక్యూరిటీ కోర్సులకు దరఖాస్తులు

### - తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఆన్ లైన్ లో దరఖాస్తుల స్వీకరణ

**హైదరాబాద్, నేడు న్యూస్:** నేషనల్ అకాడమీ ఆఫ్ సైబర్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న పలు ఉపాధి కోర్సులకు ఆన్ లైన్ లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లుగా నేషనల్ అకాడమీ ఆఫ్ సైబర్ సెక్యూరిటీ సంచాలకులు విమలా రెడ్డి తెలిపారు. ఉపాధి అవకాశాలు గల వివిధ కేంద్ర ప్రభుత్వ ఆమోదిత సైబర్ సెక్యూరిటీ అండ్ ఎథికల్ హాకింగ్ కోర్సుల్లో ఆన్ లైన్ లో శిక్షణకై రాష్ట్ర వ్యాప్తంగా ఆన్ లైన్ లో దరఖాస్తులు కోరబడుచున్నవని ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ డిప్లొమా అభ్యర్థులనుండి ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని ఆమె వివరించారు. కోర్సుల వివరాలు: సైబర్ సెక్యూరిటీ ఆఫీసర్, డిప్లొమా ఇన్ సైబర్ సెక్యూరిటీ అండ్ ఎథికల్ హాకింగ్, డిప్లొమా ఇన్ సైబర్ సెక్యూరిటీ అండ్ ఎథికల్ హాకింగ్, పీజీ డిప్లొమా ఇన్ సైబర్ సెక్యూరిటీ అండ్ ఎథికల్ హాకింగ్ కోర్సులో ఉన్నాయి. శిక్షణ అనంతరం కేంద్రప్రభుత్వ సర్టిఫికెట్స్ ప్రధానం చేయబడునని తెలిపారు. సైబర్ సెక్యూరిటీ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులకు దేశ, విదేశాలలో విస్తృత ఉపాధి అవకాశాలు ఉన్నాయని ఆమె చెప్పారు. సైబర్ సెక్యూరిటీ కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులకు ఐటీ, సాఫ్ట్ వేర్ రంగంలో ఇన్ఫర్మేషన్ ఆఫీసర్, ఇన్ఫర్మేషన్ అనలిస్ట్, పెనెట్రేషన్ టెస్టర్, సెక్యూరిటీ ఆర్కిటెక్ట్, ఐటీ సెక్యూరిటీ ఇంజనీర్, సెక్యూరిటీ సిస్టమ్స్ అడ్మినిస్ట్రేటర్ మొదలగు ఉద్యోగావకాశాలు ఉన్నాయని ఆమె వెల్లడించారు. ఈ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులకు విదేశాలలో అధిక వేతనాలతో ఉత్తమ ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకునేందుకు వెబ్ సైట్‌లో సంప్రదించాలని అలాగే మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 7893141797 లో సంప్రదించాలని ఆమె తెలిపారు.

# డివైడర్ నిర్మించారు సూచికలు మరిచారు

- నిత్యం రోడ్డు దాటి సమయాల్లో ప్రమాదాలు చవిచూస్తున్న కార్మికులు
- జీబ్రా క్రాసింగ్ లేవు... వేగనిరోధక సూచిక బోర్డులు లేవు
- ప్రమాదాలకు చెక్ పెట్టాలని కోరుతున్న స్థానికులు



**రాజేంద్రనగర్, నేడు న్యూస్ :** రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని మైలార్ దేవ్ పల్లి డివిజన్ మార్కండేయ నగర్ స్థానికులు కోరుతున్నారు. దుర్గా నగర్ నుంచి ఆరాంఘర్ వరకు ఇన్నర్ రింగ్ రోడ్డులో గల సెంట్రల్ డివైడర్ అభివృద్ధి పనులు గత కొంతకాలంగా కొనసాగుతున్నాయి. దాదాపు ఈ పనులు పూర్తి అయ్యాయి. అక్కడ రోడ్డు దాటేందుకు ఎల్లమ్మ దేవాలయం ఎదురుగా డివైడర్ మధ్యలో నడకదారి వదిలారు. ప్రతినిత్యం 5 వేల నుంచి 10 వేల మంది కార్మికులు, పాదచారులు రోడ్డు దాటి తమ తమ విధులకు వెళ్లి తిరిగి సాయంత్రం ఇంటికి చేరేందుకు ప్రయత్నిస్తారు. దుర్గానగర్ నుంచి వేగంగా దూసుకొచ్చే వాహనాలు, ఆనంద్ వైపు నుంచి అంతే వేగంతో వచ్చే వాహనాలు పాదచారులను గ్రహించే వీలుగా కనీస సూచిక బోర్డులు, వేగనిరోధక సూచికలు, జీబ్రా క్రాసింగ్ లేకపోవడంతో ప్రతిరోజు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని పలువురు మహిళా కార్మికులు వ్యక్తం చేశారు. ఇప్పటికే పదుల సంఖ్యలో ఇక్కడ రోడ్డు ప్రమాదాలకు గురై వికలాంగులుగా మారిన వారితోపాటు, ప్రాణాలు కోల్పోయిన కార్మికుల సంఖ్య కూడా అధికంగానే ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎల్లమ్మ దేవాలయానికి వచ్చే భక్తుల వాహనాల ఫోటోలు తీసి చలానాలు వేసే ట్రాఫిక్ పోలీసులకు ఇక్కడ కనీసం జిబ్రా క్రాసింగ్ ఏర్పాటు చేయాలన్న ఆలోచన మాత్రం రాకపోవడం పట్ల వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇన్నర్ రింగ్ రోడ్డులో స్పీడ్ బ్రేకర్లు నిర్మించే అవకాశం లేకపోతే కనీసం వాహన వేగాన్ని నిరోధించే వీలుగా స్పీడ్ లిమిట్ లైన్స్ వేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 8 గంటల వరకు ఇన్నర్ రింగ్ రోడ్డు లోని ఎల్లమ్మ దేవాలయం వద్ద ప్రమాదాలు ఎదురు కాకుండా పోలీస్ సిబ్బందిని నియమించాలని మార్కండేయనగర్ ప్రజలు, కార్మికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

### ప్రమాదాల నివారణకు అధికారులు దృష్టి పెట్టాలి...

స్థానికంగా నిత్యం జరుగుతున్న ప్రమాదాలను అరికట్టేందుకు అధికారులు దృష్టి సారించాలనే డిమాండ్లు రోజురోజుకు తీవ్రమవుతున్నాయి. నిత్యం రద్దీగా ఉండే రోడ్డు కావడం, ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందో తెలియని దుస్థితి నడుమ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. స్థానికంగా ప్రజల నుంచి అధికారులకు వినతులు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో అధికారులు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### తరచూ ప్రమాదాలు...!

రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని అరాంఘర్ నుంచి దుర్గానగర్ వైపు వెళ్లే ఇన్నర్ రింగ్ రోడ్డులో గల మార్కండేయనగర్ శ్రీ ఎల్లమ్మ దేవాలయం ఎదురుగా కాలినడకన రోడ్డు దాటుతున్న మహిళా కార్మికురాలిని వాహనం ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలతో మహిళ అక్కడే పడిపోయింది. స్థానికులు స్పందించి వెంటనే 108 కి సమాచారం ఇచ్చారు. 108 వచ్చే వరకు అక్కడే వేచి ఉన్న స్థానికులు బాధితురాలని 108 సిబ్బంది సహాయంతో ఆసుపత్రికి తరలించారు. రోడ్డు ప్రమాదంలో మహిళ తీవ్రంగా గాయపడినట్లు తెలుపుతున్నారు. కాటేదాన్ పారిశ్రామిక వాడలోని ఓ కంపెనీలో పని పూర్తి చేసుకొని ఇంటికి వెళుతుండగా ఘటన జరిగినట్లు తెలుస్తుంది.

### ట్రాఫిక్ పోలీసులు దృష్టి పెట్టాలి

**- యాదగిరి, భాస్కర్, మార్కండేయ నగర్ స్థానికులు**





స్థానికంగా నిత్యం ప్రమాదాలు తీవ్రమవుతున్నాయి. ఈ నేపథ్యంలో అధికారులు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి. ప్రధానంగా ట్రాఫిక్ పోలీసులు సమస్యకు శాశ్వత పరిష్కారానికి దృష్టి పెట్టాలని కోరుతున్నారు. ఎంత త్వరగా వీలు అయితే అంత త్వరగా ప్రమాదాల నివారణకు కృషి చేయాలి

### ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలి : వీడేం రమేష్

ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని స్థానికులు రోడ్డు దాటుతున్నారు. రోజు రోజుకు వాహనాల రద్దీ పెరగడంతో రోడ్డు దాటాలంటే కష్టంగా మారింది అన్ని మార్కండేయ నగర్ అధ్యక్షులు వీడేం రమేష్ అన్నారు. మార్కండేయ నగర్ బాబుల్ నగర్ ప్రాంత వాసు లు రోడ్డు దాడం కష్టంగా మారింది అన్నారు. ఇక్కడ ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మిస్తే ప్రమాదాలు నివారించవచ్చు అన్నారు. ఈనేపథ్యంలో పాదచారుల సౌలభ్యం కోసం ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



## అమరజీవి కామ్రేడ్ నోముల రామిరెడ్డి స్ఫూర్తితో పోరాటాలు నిర్మిద్దాం

**సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు**

**వలిగొండ, నేడు న్యూస్ :** అమరజీవి కామ్రేడ్ నోముల రాంరెడ్డి స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్మిద్దామని ఆయన ఆశయాలని సాధించడమే ఆయనకిచ్చే ఘననివాళని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు, మండల కార్యదర్శి సిర్పంగి స్వామి లు అన్నారు శనివారం రోజున మండల పరిధిలోని సంగెం గ్రామంలో నోముల రామి రెడ్డి 19 వ వర్ధంతి కార్యక్రమం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నోముల రామిరెడ్డి ఉన్నత కుటుంబంలో పుట్టి పెరిగినప్పటికీ నాయకులు కందాల రంగారెడ్డి సారథ్యంలో సంగెం గ్రామంలో ప్రభుత్వ బంచరాయి,పోరంబోకు భూములను భూమిలేని పేదలకు పంచాలని వివిధ కులాల వృత్తిదారులకు ఇవ్వాలని పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించి అప్పటి ప్రభుత్వాల మెడలు వంచి వారందరికీ ప్రభుత్వ భూములు ఇప్పించారన్నారు సిపిఎం పార్టీ విస్తరణ కోసం నిరంతరం కృషి చేశారని పేదల సమస్యల పరిష్కారానికి ఎర్రజెండా నాయకత్వమంలో సమస్యలు పరిష్కారం అవుతాయని నమ్మకంతో ప్రజా పోరాటాలు నిర్వహించారని అన్నారు పరిసర గ్రామాలుగా ఉన్న వర్కట్ పల్లి,గోకారం గ్రామాల్లో సిపిఎం ఉద్యమ విస్తరణ కోసం అనేకమంది కార్యకర్తలను తయారు చేశారని అన్నారు వారి యొక్క స్ఫూర్తితో నేడు ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలపై పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు ఏనుగు సాయి రెడ్డి,సింగిల్ విండో చైర్మన్ సురకంటి వెంకటరెడ్డి,మాజీ సర్పంచ్ కీసరి రాంరెడ్డి,కాంగ్రెస్ మండల నాయకులు బద్దం సంజీవరెడ్డి,ఉంగ్రాటి సత్యనారాయణ, టిఆర్ఎస్ మండల నాయకులు వరికుప్పల మల్లేశం,సిపిఎం శాఖ కార్యదర్శి మండల కమిటీ సభ్యులు భీమనబోయిన జంగయ్య, మాజీ ఉపసర్పంచ్ ఎలకలపల్లి నరసింహ, రామిరెడ్డి కుమారుడు సిపిఎం నాయకులు నోముల జంగారెడ్డి,ఏనుగు ప్రభాకర్ రెడ్డి,బండిగారి రాములు, నోముల జంగారెడ్డి, మాధవరెడ్డి,కుంట్ల గంగిరెడ్డి,కొలను రామిరెడ్డి,జక్కుల వెంకటేశం, బొడ్డు కృష్ణ, రామిరెడ్డి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలియజేసిన రాష్ట్ర బీసీ నాయకులు హరికృష్ణ

**కూకట్‌పల్లి, నేడు న్యూస్ :** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర మంత్రిమండలి తీర్మానించడంపై హర్షం వ్యక్తం చేస్తూ తెలంగాణ రాష్ట్ర బీసీ నాయకులు జర్నలిస్టు తెల్ల హరికృష్ణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలియజేశారు. రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘాల జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య నేతృత్వంలో వివిధ సంఘాల బీసీ నాయకులు కలిసి చేసిన పోరాట ఫలితమే అని కొనిగాడుతూ సంబంధిత చట్ట సవరణకు ఆర్డినెన్స్ జారీ చేసి బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న నిర్ణయంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి తెల్ల హరికృష్ణ ధన్యవాదాలు తెలియజేశారు.



## ఇల్లందు విప్లవోద్యమ తారల కోసం జూలై 16న స్మారక స్థూపాల ఆవిష్కరణ సభ

**ప్రజలకు సంఘీభావంగా మాస్‌లైన్ పిలుపు**

**కారేపల్లి, నేడు న్యూస్ :** ఇల్లందులోని విప్లవోద్యమ తారలు కామ్రేడ్ రాయల చంద్రశేఖర్, కామ్రేడ్ ఎల్లన్న, కామ్రేడ్ గండి యాదన్నల స్మృతిని చిరస్థాయిగా నిలుపుకోవడం కోసం ఏర్పాటు చేయబోయే స్మారక స్థూపాల ఆవిష్కరణ సభను జూలై 16న ఘనంగా జరిపిద్దామని సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ పిలుపునిచ్చింది. సింగరేణి మండలం పోలంపల్లిలో ప్రచార పోస్టర్ల ఆవిష్కరణ జరిగింది. అనంతరం మండలంలోని గ్రామాలు – పోలంపల్లి, నాగయ్యగుంపు, పేరుపల్లి, జమాలపల్లి, మల్లన్నగూడెం, గుంపెల్లగూడెం, మాదారం, గోవిందతండ, టేకుల గూడెం, గాదపాడు, మాణిక్కారం తదితర ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ ఖమ్మం డివిజన్ కమిటీ సభ్యుడు కామ్రేడ్ గుగులోతు తేజ నాయక్ మాట్లాడుతూ.. ప్రజల కోసం తమ ప్రాణాలను అర్పించిన రాయల చంద్రశేఖర్, ఎల్లన్న, గండి యాదన్నల విప్లవ స్ఫూర్తిని ఇల్లందు ప్రాంత ప్రజలు మరువకూడదు. వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే నిజమైన గౌరవం అని చెప్పారు. వారు పేర్కొన్నట్లు, ఈ విప్లవ నాయకులు భూమిలేని పేదలకు భూమి, కూలి, తునికాకు ధరల పెంపు, ఉపాధి, విద్య, వడ్డీ వ్యాపారుల దోపిడీకి వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించారు. ఎల్లన్నను రాష్ట్ర ప్రభుత్వం ఎన్కౌంటర్ పేరుతో హత్య చేసిన ఘటనను ఆయన గుర్తు చేశారు. అదే స్ఫూర్తితో ప్రజల హక్కుల కోసం నేటి తరం కూడా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. సీతారామ ప్రాజెక్టు నీళ్లు ఏజెన్సీ ప్రజలకు అందేలా చేయాలన్నది ఈ పోరాట లక్ష్యం అని స్పష్టం చేశారు. ప్రజాపంథా పార్టీ ముందడుగు వేయడానికి సిద్ధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కారేపల్లి–కామేపల్లి సంయుక్త మండల కార్యదర్శి ధారావత్ సక్రు నాయక్, పంచాయతీ కార్మిక సంఘం హరిదాస్, గుగ్గులోతు లక్ష్మణ్, అఖిల భారత ఐక్య రైతుసంఘం నాయకుడు పూలకాని సత్తిరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పాపారావు, వెంకటేశ్వర్లు, వీరన్న పాల్గొన్నారు.

## బీజేఎంసీలో సమస్యల పరిష్కారానికి సహకరిస్తా

**ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**



**రాజేంద్రనగర్ నేడు న్యూస్ :** బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో ప్రజల సమస్యల పరిష్కారానికి సహకరిస్తానని రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తెలిపారు. కార్పోరేషన్ పరిధిలోని తిరుమలహిల్స్ కాలనీలో ప్రజల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సహకరించడంతో శనివారం ఎమ్మెల్యేను కాలనీవాసులు పాల్గొని ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఇటీవల ఎమ్మెల్యే కార్పొరేషన్ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయడం జరిగిందన్నారు. తిరుమల హిల్స్ కాలనీలో రూ.35 లక్షల రూపాయల వ్యయంతో రోడ్లు త్వరితగతిన పూర్తి చేశారన్నారు. ఈ సందర్భంగా సంతోషంతో ఎమ్మెల్యేను కలిసి ఘనంగా సన్మానించామన్నారు. అదేవిధంగా ఇటీవలే బీసీలకు స్థానిక ఎన్నికలలో 42% రిజర్వేషన్ కల్పిస్తూ క్యాబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని ప్రస్తావిస్తూ.. దానికై ఎమ్మెల్యే చేసిన కృషిని కాలనీవాసులు కొనియాడారు. సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తూ, నిత్యం ప్రజల సమస్యలను తీరుస్తున్న నాయకుడు హరీష్ గౌడ్ ను ఎమ్మెల్యే ప్రత్యక్షంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కార్పొరేషన్ లో ఇటీవలే కోట్ల రూపాయల వ్యయంతో పలు అభివృద్ధి కార్యక్రమాలు శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. పనులను నాణ్యతతో చేపట్టేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీ వైస్ ప్రెసిడెంట్ సంజీవ్, జనరల్ సెక్రటరీ రత్నాకర్, కాలనీ పెద్దలు జ్ఞానేశ్వర్, ప్రతాప్ రెడ్డి, కాలనీ యువకులు పాల్గొన్నారు.

## మహారాష్ట్ర తీర్థయాత్రలకు ఆర్టీసీ టూర్ ప్యాకేజ్

**డీఎం సునీతా దేవి**

**కామారెడ్డి జిల్లా, జులై 12, నేడు న్యూస్ బ్యూరో :** బాన్సువాడ ఆర్టీసీ డిపో నుంచి వివిధ రకాల టూర్లకు విశేష స్పందన లభిస్తోంది. అధికారుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యాత్ర ప్యాకేజీలను ప్రయాణికులు ఆదరిస్తున్నారు. ప్రైవేట్ వాహనాల్లో యాత్రలకు వెళ్తే రవాణా ఖర్చులు ఎక్కువగా ఉండడం.. భద్రత దృష్ట్యా టూరిస్టులు ఎక్కువగా ఆర్టీసీ ప్యాకేజీలకు ఆకర్షితుల వుతున్నారు. బాన్సువాడ నుంచి మహారాష్ట్ర యాత్ర బాన్సువాడ నుంచి మహారాష్ట్రలోని పర్లీ వైద్యనాథ్ అంబాజోగాయ్, పండరిపూర్ విఠలేశ్వర్ మందిరం షోలాపూర్, తుల్జాపూర్ భవానీ మాత దర్శనం ఈనెల 20న సూపర్ లగ్జరీ బస్సు నడుపుతున్నట్లు డీఎం సరితాదేవి తెలిపారు. ఉదయం 6 గంటలకు బాన్సువాడ నుంచి బయలుదేరుతుందని, మరుసటి రోజు (21న) సాయంత్రం 6 గంటలకు చేరుకుంటుందని అన్నారు. టికెట్ ధర పెద్దలకు రూ. 2,200, పిల్లలకు రూ.1,100 ఉంటుందని, ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. టికెట్స్ కోసం గోపికృష్ణ 9063408477ను సంప్రదించాలని సూచించారు.

### చేయి దాటుతున్న నేతలు.. కామారెడ్డి కాంగ్రెస్‌లో రచ్చకెక్కిన విభేదాలు

బిర్లా మందిర్ టూర్.. ఈనెల 19న బాన్సువాడ – బిర్లా మందిరం సాలార్‌జింగ్ మ్యూజియం ముచ్చింతల్ టూర్ ప్యాకేజీ ఏర్పాటు చేశారు. బాన్సువాడ నుంచి ఉదయం 6 గంటలకు బస్సు బయలుదేరి రాత్రి 12 గంటలకు బాన్సువాడకు చేరుకుంటుందన్నారు.



## సెంచరీతో కదం తొక్కిన ఆర్మూర్ యువ క్రికెటర్ రతన్ విజ్ఞాన్

**నిజామాబాద్ జిల్లా బ్యూరో, నేడు న్యూస్, ఆర్మూర్, జులై 12 :** తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ అంతర్ జిల్లా అండర్ 19 వన్డే క్రికెట్‌లో సెంచరీ సాధించిన ఆర్మూర్ క్రికెటర్ రతన్ విజ్ఞాన్.. ఆర్మూర్‌లో జరిగినటువంటి అండర్ 19 నిర్ణీత 50 ఓవర్ల వన్డేలో ఆర్మూర్ వర్సెస్ నిర్మల్ జట్లు తెలపడగా ఆర్మూరు జట్టు 50 ఓవర్లలో 399 పరుగులు సాధించింది. ఇందులో ఆర్మూర్ పట్టణానికి చెందిన రతన్ విజ్ఞాన్ 88 బంతులను ఎదుర్కొని సెంచరీ పూర్తి చేశాడు. అందులో 14 ఫోర్లు ఉండడం విశేషం.. ఆర్మూరు డివిజన్ జట్టు తరపున మతిన్ 80 పరుగులతో రాణించగా, గుఫ్రాన్ 74, హేమంత్ 56 పరుగులు చేయడంతో ఆర్మూర్ భారీ స్కోరు సాధించగలిగింది. అనంతరం బ్యాటింగ్కు దిగిన నిర్మల్ జట్టు కేవలం 187 పరుగులకే ఆల్ అవుట్ అయింది. నిర్మల్ చెట్టు తరపున శ్రీపాద 96 పరుగులతో జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. సెంచరీ సాధించిన రతన్ విజ్ఞాన్ పలువురు అభినందించారు.



## బోనాల ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

- భక్తులు ఇబ్బందులు పడకుండా ఆలయాల అభివృద్ధి
- రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**రాజేంద్రనగర్ నేడు న్యూస్ :** బోనాల ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేయడం జరుగుతుందని, భక్తులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటున్నామని రాజేంద్రనగర్ నియోజకవర్గం శాసనసభ్యులు ప్రకాష్ గౌడ్ అన్నారు. శనివారం పండుగకు ఆలయాలను సిద్ధం చేయడానికి రూ. 27 లక్షల చెక్కులను ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రజలకు అత్యంత ప్రీతిపాత్రమైన బోనాల పండుగను పురస్కరించుకుని మైలార్ దేవ్ పల్లి, రాజేంద్రనగర్, అత్తాపూర్, శాస్త్రీపురం డివిజన్ల పరిధిలోని అమ్మవారి ఆలయాలను సుందరంగా తీర్చిదిద్దేందుకు, బోనాల సంబరాలను ఘనంగా నిర్వహించేందుకు నిధులు కేటాయించడం జరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్లానింగ్ కమిషన్ చైర్మన్ చిన్నారెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మొత్తం రూ.27 లక్షల విలువైన 79 చెక్కులను ఆయా ఆలయ కమిటీల ప్రతినిధులకు పంపిణీ చేశారు. ఈ నిధులు బోనాల పండుగ సందర్భంగా ఆలయాల అలంకరణ, విద్యుద్దీకరణ, భక్తుల సౌకర్యాలు, పండుగ నిర్వహణకు వినియోగించబడతాయన్నారు. బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, ఈ పండుగను భక్తులు ఆనందోత్సాహాలతో జరుపుకునేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో అన్ని పండుగలకు సమాన ప్రాధాన్యత ఇస్తున్నామని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ ఇన్స్పెక్టర్ మోహన్ రెడ్డి, ఆలయ ఈఓ రమాదేవి, సిద్దులగుట్ట ఈఓ రామ శర్మ, స్థానిక ప్రజా ప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## యువకుడిపై హత్యాయత్నం చేసిన నలుగురిపై కేసు నమోదు

**రాజేంద్రనగర్ నేడు న్యూస్ :** యువకుడిపై నలుగురు దాడి చేసిన సంఘటన అత్తాపూర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజేంద్రనగర్ సర్కిల్ అత్తాపూర్ సులేమాన్ నగర్‌కు చెందిన మొహమ్మద్ రెహాన్ (20) జెప్టో రైడర్ గా విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం స్టోర్‌లో రైడర్‌గా పనిచేసే సులేమాన్ తనతో పాటు యూనస్‌ను తీసుకెళ్లాడు. పరిమిత ఆదేశాలు ఉన్నందున రెహాన్ యూనస్ ఎందుకు ఉన్నావంటూ ప్రశ్నించాడు. దీంతో రెహాన్, సులేమాన్, యూనస్ ల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో సులేమాన్, యూనస్ లు మరో ఇద్దరు స్నేహితులకు ఫోన్ చేసి రమ్మనడంతో గొడవ మరింత తీవ్రమైంది. రెహాన్ పై తీవ్రంగా దాడికి పాల్పడ్డాడు. కత్తితో సైతం దాడి చేశారు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మొహమ్మద్ యూనస్, మొహమ్మద్ సులేమాన్ లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మరో ఇద్దరు మొహమ్మద్ ఇమ్రాన్, కలీమ్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.



# పైలట్లు లేకుండానే దర్యాప్తు ఎలా చేస్తారు..?

### నివేదికపై ఎయిర్‌లైన్స్ పైలట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అసంతృప్తి

**న్యూఢిల్లీ :** అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) ఇచ్చిన ప్రాథమిక నివేదికను ఎయిర్‌లైన్స్ పైలట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఖండించింది. విచారణ జరిగిన తీరు, నివేదికలో వివరాలు వెల్లడించిన విధానం పైలట్లదే తప్పిదమనే అర్థం గోచరించేలా పక్షపాత ధోరణిలో ఉందని తన ప్రకటనలో పేర్కొంది. "మీడియాకు లీక్ అయిన ఈ నివేదికపై బాధ్యతాయుత స్థానంలో ఉన్న ఏ అధికారి సంతకం లేదు. ఈ దర్యాప్తులో ఎలాంటి పారదర్శకత కనిపించలేదు. అత్యంత గోప్యంగా జరిగిన ఈ ప్రక్రియ ఎంతగానో ఆశ్చర్యపర్చింది. నిపుణులైన మరీ ముఖ్యంగా లైన్ పైలట్లు (షెడ్యూల్డ్ ఫ్లైట్లు నడిపే వారు) ఆ దర్యాప్తులో భాగం కాలేదు" అని ఆల్ఫా అధ్యక్షుడు సామ్ థామస్ అన్నారు. విమానం ఇంజిన్ ఇంధన స్విచ్‌ల అనుకోని కదలికలు దుర్ఘటనకు కారణమంటూ వాల్‌స్ట్రీట్ జర్నల్‌లో వచ్చిన కథనాన్ని అసోసియేషన్ ప్రస్తావించింది. ఇలాంటి సున్నితమైన సమాచారం మీడియాకు లీక్ కావడంపై దిగ్భ్రాంతి వ్యక్తంచేసింది. పారదర్శకత కోసం పరిశీలకులుగా తమను విచారణలో భాగం చేసుకోవాలని కోరింది. జూన్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాదంపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) 15 పేజీలతో తాజాగా ప్రాథమిక నివేదికను సమర్పించిన సంగతి తెలిసిందే. విమానం టేకాఫ్ అయ్యాక సెకన్ల వ్యవధిలో ఇంధన కంట్రోల్ స్విచ్‌లు ఆగిపోయినట్లు వెల్లడించింది. ఆ స్విచ్ ఎందుకు ఆఫ్ చేశావని ఒక పైలట్.. మరో పైలట్‌ను ప్రశ్నించాడని రిపోర్ట్‌లో పేర్కొంది. తాను స్విచ్ ఆఫ్ చేయలేదని మరో పైలట్ సమాధానం ఇచ్చినట్లు తెలిపింది. కాక్‌పిట్‌లో ఇవే పైలట్ల ఆఖరి మాటలని ఏఏఐబీ తెలిపింది. కాగా ఈ నివేదికపై ఇప్పటికే కేంద్రప్రభుత్వం నుంచి స్పందన వచ్చిన సంగతి తెలిసిందే. "ప్రపంచంలోనే అత్యంత ప్రతిభ కలిగిన పైలట్లు, సిబ్బంది మన దగ్గర ఉన్నారు. వారు పౌర విమానయానానికి వెన్నెముక వంటివారు. ఈ రంగానికి వారే ప్రధాన వనరులు. వారి సంక్షేమం, శ్రేయస్సు కోసం మా ప్రభుత్వం పనిచేస్తుంది. ప్రమాదంపై అప్పుడే ఒక నిర్ధరణకు రావొద్దు. తుది నివేదిక వచ్చేవరకు వేచి చూడాలి. ఈ కేసులో ఎన్నో టెక్నికల్ అంశాలు ఇమిడి ఉన్నాయి" అని పౌర విమానయానశాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు మీడియాతో మాట్లాడిన సంగతి తెలిసిందే.




# ఆ చేప కోసం.. 300 డ్యామ్‌లు కూల్చేసిన చైనా..

**చైనా :** పర్యావరణ పరిరక్షణలో భాగంగా చైనా కీలక నిర్ణయాలు అమలుచేస్తోంది. ఇప్పటివరకు 300 డ్యామ్‌లను కూల్చివేసింది. ఉన్న 373 హైడ్రోపవర్ స్టేషన్లలో 342 చిన్నస్థాయి హైడ్రోపవర్ స్టేషన్ల కార్యకలాపాలు నిలిపివేసింది. ఒక చేప జీవజాలాన్ని, ఒక నది సహజత్వాన్ని కాపాడేందుకు 2020 నుంచి ఈ చర్యలు తీసుకుంటోందని సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ పేర్కొంది. ఆసియాలో అతి పొడవైన యాంగ్జీ నది.. చైనా ఆహార భద్రత, ఆర్థికవ్యవస్థకు అతి కీలకమైంది. గత కొన్ని దశాబ్దాల కాలంలో చైనా భారీస్థాయిలో డ్యామ్‌లు, హైడ్రోపవర్ ప్రాజెక్టులను నిర్మించింది. అవి జలచరాలపై తీవ్ర ప్రభావాన్ని చూపించాయి. యాంగ్జీ ఉపనదుల్లో ఒకటైన చిషుయ్ హే (రెడ్‌రివర్)ను అరుదైన, స్థానిక చేప జాతులకు ఆవాసంగా పరిగణిస్తారు. అలాంటిది డ్యామ్‌లు, పవర్‌స్టేషన్‌లు ఆ నదీ ప్రవాహాన్ని కట్టడి చేశాయి. గతంలో ఈ నది ప్రవహించిన ప్రాంతాలకు నీరందకపోవడంతో ఆ ప్రాంతాలు ఎండిపోయాయి కూడా. జీవవైవిధ్యం దెబ్బతినడం, కొన్ని జాతులు అంతరించేపోయే దశకు చేరుకోవడంపై పర్యావరణవేత్తలు తీవ్ర ఆందోళనను వ్యక్తంచేశారు. ఈ క్రమంలోనే డ్రాగన్ ఈ చర్యలకు పూనుకుంది. యాంగ్జీ స్టర్జన్‌గా పేరుపొందిన స్టర్జన్ ఫ్యామిలీకి చెందిన చేపను 2022లో అంతరించిపోతున్న జాతిగా ప్రకటించారు. గతంలో అది యాంగ్జీ పరివాహక ప్రాంతమంతా కనిపించేది. 1970 నుంచి స్టర్జన్ సంతతి పడిపోతూ వస్తోంది. డ్యామ్‌ల నిర్మాణం, అతిగా చేపలు పట్టడం వంటివి అందుకు కారణాలయ్యాయి. కాగా.. ప్రస్తుతం రెడ్ రివర్ పునరుద్ధరణ ప్రాజెక్ట్‌తో అవి మళ్లీ తమ ఉనికిని చాటుతాయనే భావన వ్యక్తమవుతోంది. 2023, 2024లో రెండు బ్యాచ్‌ల యాంగ్జీ స్టర్జన్‌లను నదిలోకి వదలగా.. అవి విజయవంతంగా నదిలో మనుగడ సాగించడం ప్రారంభించాయని శాస్త్రవేత్తలు వెల్లడించారు.

# ఇరాన్‌లో బాలికపై హత్యాచారం

### దోషికి బహిరంగ మరణశిక్ష



**ఇరాన్ :** ఓ బాలికను హత్యాచారం చేసిన కేసులో దోషిగా తేలిన వ్యక్తికి ఇరాన్ అధికారులు బహిరంగంగా మరణశిక్ష విధించారు. ఈమేరకు స్థానిక మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. వాటి ప్రకారం.. బుకాన్‌కు చెందిన ఓ బాలికను అత్యాచారం, హత్య చేసిన కేసులో ఓ వ్యక్తి దోషిగా తేలాడు. అతడికి బహిరంగంగా మరణశిక్ష విధించాలని బాధిత కుటుంబ సభ్యులు, ప్రజల నుంచి పెద్దఎత్తున అభ్యర్థనలు వచ్చాయి. మార్చిలో అతడికి మరణశిక్ష ఖరారు కాగా.. సుప్రీంకోర్టు కూడా దాన్ని సమర్థించింది. భావోద్వేగాలతో ముడిపడిన కేసు కాబట్టి కఠినశిక్షపై నిర్ణయం తీసుకున్నామని న్యాయమూర్తి పేర్కొన్నారు. బాధిత కుటుంబసభ్యుల కోరిక మేరకు శిక్షను విధిస్తున్నట్లు చెబుతూ తాజాగా దాన్ని అమలు చేశారు. ఇరాన్‌లో బహిరంగంగా మరణశిక్షలు విధించడం సాధారణమే. హత్య, అత్యాచారం వంటి తీవ్రత ఎక్కువున్న కేసుల్లో ఇలాంటి కఠినమైన శిక్షలను అమలుచేస్తారు. మానవ హక్కుల సంఘాల ప్రకారం.. ప్రపంచంలో ఎక్కువ మరణశిక్షలు అమలుచేసే దేశాల్లో ఇరాన్ రెండో స్థానంలో ఉంది. మొదటి స్థానంలో చైనా ఉంది.

# రాజకీయాలు చాలా కాస్ట్‌లీ..

- నిజాయితీగా పనిచేసే ఎంపీలకు జీతం సరిపోవట్లేదు
- సొంత డబ్బును ఉపయోగించి సమస్యను పరిష్కరించండి అంటున్నారు
- ఎంపీ కంగనా రనౌత్



**న్యూఢిల్లీ :** రాజకీయాల్లో నిజాయితీగా పనిచేసే ఎంపీలకు జీతం సరిపోదని ఎంపీ కంగనా రనౌత్ పేర్కొన్నారు. తమతో ఉండే సిబ్బందికి జీతాలు ఇచ్చిన తర్వాత ఎంపీలకు మిగిలేది అంతంతమాత్రమేనని తెలిపారు. ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రజాప్రతినిధులు, పీఏలతో తమ నియోజకవర్గాలకు వాహనాల్లో వెళ్లేందుకు రూ.లక్షల్లో ఖర్చవుతుందని కంగనా పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ఒక్కో ప్రదేశం 300–400 కి.మీ.ల దూరంలో ఉండటమే అందుకు కారణమన్నారు. కాబట్టి రాజకీయాలు ఖర్చుతో కూడుకున్నవని ఆమె అభిప్రాయపడ్డారు. దీనివల్ల ఎంపీలకు వచ్చే జీతం సరిపోవట్లేదన్నారు. అందుకే మరో ఉద్యోగం చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికే చాలామంది ఎంపీలకు వ్యాపారాలు ఉన్నాయని, మరికొందరు న్యాయవాదులుగా ఉన్నారని తెలిపారు. ఎంపీగా ఉంటే మరో ఉద్యోగం అవసరం అవుతుంది కాబట్టి ఆ పదవిని వృత్తిగా తీసుకోలేమన్నారు.

### ఒకప్పుడు ట్రంప్‌నకు మద్దతు..

ఈసందర్భంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురించి కూడా ఆమె ఇంటర్వ్యూలో మాట్లాడారు. భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ ప్రభావాన్ని ప్రశ్నించే వారిపై అడిగిన ప్రశ్నకు.. అంతా తానే చేశానని ట్రంప్ చెప్పుకుంటున్నారని అన్నారు. గతంలో ట్రంప్‌నకు తాను మద్దతుదారునని తెలిపారు. కానీ, ప్రస్తుతం ఆయన వెళ్తున్న తీరు తనకు నచ్చడం లేదన్నారు. సొంత దేశం విషయంలో కూడా ఆయన తప్పులు చేస్తున్నారని తనకు అనిపిస్తోందన్నారు. ఇక, యాపిల్ తయారీ ప్లాంట్లను భారత్‌కు తరలించొద్దని సీఈవో టిమ్ కుక్‌కు ట్రంప్ సూచించిన నేపథ్యంలో అతనిపై మండిపడుతూ కంగనా గతంలో ఓ ట్వీట్ పెట్టిన సంగతి తెలిసిందే. వ్యక్తిగత అసూయతో, దౌత్యపరమైన అభద్రతాభావంతో ఇటువంటి పనులు చేస్తున్నారని పేర్కొన్నారు. ఆ తర్వాత ఆమె ఆ పోస్టును తొలగించారు. కాగా.. తాను రాజకీయ జీవితాన్ని పూర్తిగా ఆస్వాదించలేకపోతున్నానని ఇటీవల కంగనా పేర్కొన్నారు. ప్రజలు తన వద్దకు పంచాయతీ స్థాయి సమస్యలను కూడా తీసుకొస్తున్నారని.. 'మీ సొంత డబ్బును ఉపయోగించి సమస్యను పరిష్కరించండి' అని అంటున్నారని ఆమె అసహనం వ్యక్తంచేశారు. ఈసందర్భంగా ప్రధాని కావాలన్న లక్ష్యం ఉందా అని అడిగిన ప్రశ్నకు.. అందుకు తాను సమర్థురాలిని కాదన్నారు. ఆ కోరిక తనకు లేదని, దేవుడు తనను ప్రధాని చేయడని వ్యాఖ్యానించారు.

### కుర్చీ అంత ఈజీగా దొరకదు..

# చిక్కితే వదలొద్దు

### డీకే శివకుమార్



**బెంగళూరు:** కర్ణాటకలో 'సీఎం మార్పు' అంశంపై రాజకీయం రోజురోజుకీ వేడెక్కుతోంది. ఐదేళ్లూ తానే ముఖ్యమంత్రినని ఓవైపు సిద్ధరామయ్య నొక్కి చెబుతున్నారు. అటు ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్.. తన చేతుల్లో ఏమీ లేదంటూనే 'ఆశ పడటంలో తప్పులేదు కదా' అనే సంకేతాలిస్తారు. ఈ పరిణామాల నేపథ్యంలో తాజాగా డీకే చేసిన వ్యాఖ్యలు మరింత చర్చనీయాంశంగా మారాయి. కుర్చీ దొరికితే వదలొద్దంటూ అధికార పీఠంపై తనకున్న ఆసక్తి గురించి ఆయన నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు. బెంగళూరులో న్యాయవాదుల సంఘం ఏర్పాటుచేసిన ఓ కార్యక్రమంలో డీకే శివకుమార్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "ఇక్కడ చాలామంది లాయర్లు సీట్లు ఖాళీగా ఉన్నా అందులో కూర్చోవట్లేదు. కానీ, మేమందరం మాత్రం ఓ కుర్చీ కోసం తీవ్ర పోరాటాలు చేస్తుంటాం. కుర్చీని సంపాదించడం అంత ఈజీ కాదు. ఒకవేళ దొరికితే మాత్రం ఆ అవకాశాన్ని వదులుకోవద్దు. అందులో కూర్చోవాలి. మీకు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి" అని కర్ణాటక డిప్యూటీ సీఎం వ్యాఖ్యానించారు. ఆయన వ్యాఖ్యలతో అక్కడున్నవారంతా నవ్వులు చిందించారు. అయితే, ఇందులో ఆయన అధికారం అనే పదాన్ని ఉపయోగించనప్పటికీ.. రాష్ట్ర రాజకీయాలను ఉద్దేశించే డీకే ఇలా మాట్లాడారంటూ అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు నెట్టింట వైరల్‌గా మారాయి. 2023లో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటినుంచే డీకే, సిద్ధరామయ్య ల మధ్య కుర్చీలాట మొదలైన సంగతి తెలిసిందే. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంపికపై హస్తం పార్టీ తీవ్ర కసరత్తు చేసింది. చివరకు సీనియార్టీ, ఇతరత్రా అంశాలను దృష్టిలోపెట్టుకొని సిద్ధరామయ్యను హైకమాండ్ ఎంచుకుంది. అయితే, రెండున్నరేళ్ల తర్వాత ముఖ్యమంత్రి పీఠం మార్పు ఉంటుందని అప్పటి నుంచే ప్రచారం జరుగుతోంది. ఆ పార్టీ ఎమ్మెల్యేలు కూడా దాన్నే విశ్వసిస్తున్నారు. ఈ క్రమంలోనే ఇటీవల పలువురు ఎమ్మెల్యేలు, కార్యకర్తలు బహిరంగంగానే దీనిపై వ్యాఖ్యలు చేశారు. దీనిపై డీకే, సిద్ధరామయ్య ఇద్దరూ స్పష్టతనిస్తూనే ఉన్నా.. రాజకీయం మాత్రం రసవత్తరంగా మారింది. అయితే, సిద్ధరామయ్యను గద్దె దించితే పార్టీ రెండుగా చీలిపోతుందని అధిష్ఠానం భయపడుతోంది. అందుకే.. ఆయనను కొనసాగించేందుకే మొగ్గుచూపుతున్నట్లు తెలుస్తోంది.

### రష్యాకు 40శాతం ఆయుధాలు

# ఉత్తరకొరియా సరఫరా : ఉక్రెయిన్



**ఉక్రెయిన్ :** ఉక్రెయిన్‌పై జరుగుతున్న యుద్ధం నేపథ్యంలో రష్యాకు ఉత్తరకొరియా మద్దతుగా ఉన్న సంగతి తెలిసిందే. ఈక్రమంలో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. తమతో జరుగుతున్న యుద్ధంలో వాడే 40 శాతం ఆయుధాలు ఉత్తరకొరియా నుంచే రష్యాకు అందుతున్నాయని ఉక్రెయిన్ ఆరోపించింది. ఉక్రెయిన్ మిలిటరీ ఇంటెలిజెన్స్ అధ్యక్షుడు కైరులా బుడనోవ్ ఈవిషయాన్ని బయటపెట్టారు. గతేడాది రష్యా అధ్యక్షుడు పుతిన్, ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్‌ల మధ్య మిలిటరీ ఒప్పందం జరిగిన సంగతి తెలిసిందే. ఈ ఒప్పందంలో భాగంగా ఉ.కొరియా అనేక బాలిస్టిక్ క్షిపణులు, ఫిరంగి వ్యవస్థలను మాస్కోకు చేరవేస్తున్నట్లు తెలిపారు. దీనికి బదులుగా రష్యా నుంచి పెద్దమొత్తంలో నగదు, టెక్నాలజీని ఉత్తరకొరియా పొందుతున్నట్లు వెల్లడించారు. ఈసందర్భంగా కాల్పుల విరమణ ఒప్పందం వీలైనంత త్వరగా జరగాలని బుడనోవ్ ఆశాభావం వ్యక్తంచేశారు. యుద్ధంలో రష్యాకు బేషరతుగా మద్దతిస్తున్నట్లు కిమ్ ఇప్పటికే ప్రకటించారు. మిలిటరీ ఒప్పందం నేపథ్యంలో ఇరుదేశాల మధ్య సైనిక సంబంధాలు తీవ్రంగా బలపడ్డాయి. ఈ క్రమంలో మరో 30 వేల మంది సైనికులను మాస్కోకు మద్దతుగా పంపేందుకు కిమ్ సిద్ధమైనట్లు ఇటీవల వార్తలు కూడా వచ్చాయి. గతేడాది కుర్స్క్ ప్రాంతంలోకి ఉక్రెయిన్ సేనలు చొచ్చుకురావడంతో.. నవంబర్‌లో దాదాపు 11,000 మంది సైనికులను కిమ్ ప్రభుత్వం పంపించింది. ఇదిలాఉండగా.. రష్యా– ఉక్రెయిన్‌ల మధ్య కాల్పుల విరమణ చేసేందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రయత్నిస్తున్నారు. పలుమార్లు పుతిన్‌తోనూ ఫోన్లో మాట్లాడారు. అయినప్పటికీ ఈ చర్చలు ముందుకు సాగకపోవడంపై ఆయన అసంతృప్తికి గురయ్యారు. కాగా.. అమెరికా సైనిక ఆయుధ నిల్వలు తగ్గాయనే ఆందోళనల నేపథ్యంలో గతంలో ఆమోదించిన కీలక ఆయుధాల సరఫరాను అమెరికా ఉక్రెయిన్‌కు నిలిపివేసినట్లు గతంలో ట్రంప్ పేర్కొన్నారు. ఆ నిర్ణయంపై యూటర్న్ తీసుకున్న ట్రంప్ పుతిన్ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నందున కీవ్‌కు ఆయుధాలు ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.

# 'నన్ను ఉరితీయండి'.. టెన్నిస్ ప్లేయర్ తండ్రి పశ్చాత్తాపం

**గురుగ్రామ్:** హరియాణాకు చెందిన టెన్నిస్ క్రీడాకారిణి రాధికా యాదవ్ (25)ను తండ్రి దీపక్ యాదవ్ (49) హత్య చేసిన కేసులో కొత్త విషయాలు వెలుగు చూస్తున్నాయి. ఆవేశంలో కుమార్తెను చంపిన దీపక్ ఇప్పుడు కుమిలిపోతున్నారని అతడి కుటుంబం వెల్లడించింది. దీనిపై దీపక్ సోదరుడు విజయ్ యాదవ్ మీడియాతో మాట్లాడారు. "ఇది పెద్ద తప్పిదం. నేను దీపక్ వెంట పోలీసు స్టేషన్‌లో ఉన్నప్పుడు అతడు ఎంతో పశ్చాత్తాపంతో ఉన్నాడు. 'నన్ను ఉరితీసే విధంగా ఎఫ్ఐఆర్ రాయండి' అని పోలీసులకు చెప్పాడు. నేను ఆడపిల్లను చంపేశానంటూ రోదించాడు" అని విజయ్ వెల్లడించారు. ప్రస్తుతం దీపక్‌ను రెండువారాల జ్యుడిషియల్ కస్టడీకి అప్పగించారు. రాధికా హత్యకేసులో ఎన్నో కోణాలు వెలుగు చూస్తున్నాయి. తన సంపాదనపై ఆధారపడి బతుకుతున్నారంటూ కుమార్తె అవహేళన చేయడంతోనే తండ్రి ఈ హత్యకు పాల్పడ్డారని మొదట వార్తలు వచ్చాయి. అయితే, ఆ కుటుంబంతో పరిచయం ఉన్నవారు మాత్రం ఆ కథనాల్లో వాస్తవం లేదని చెబుతున్నారు. రాధిక గతేడాది ఓ కళాకారుడితో కలిసి మ్యూజిక్ రీల్స్ చేసింది. ఈ ఉదంతం వారి కుటుంబంలో చిచ్చు రేపినట్లుగా తెలుస్తోంది. రాధిక టెన్నిస్ అకాడమీని నిర్వహించడం తండ్రికి ఇష్టం లేకపోవడమే ఘర్షణకు కారణమని వినవస్తోంది.



# భూమికి తిరిగొచ్చాక శుభాంశు శుక్లాకు క్వారంటైన్

**న్యూఢిల్లీ :** యాక్సియం–4 మిషన్‌లో భాగంగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్) వెళ్లిన భారత వ్యోమగామి శుభాంశు శుక్లా , మరో ముగ్గురు వ్యోమగాములు ఈనెల 14న భూమికి తిరిగి రానున్నారు. జులై 15న కాలిఫోర్నియా తీరంలో వారు ల్యాండ్ అయిన వెంటనే వ్యోమగాములను ఏడు రోజుల పాటు క్వారంటైన్‌కు తరలించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. శుభాంశుతో పాటు పెగ్గీ విట్సన్, స్లావోస్జ్ ఉజ్నాన్స్‌కీ–విస్నియెస్కీ, టిబర్ కపులు అంతరిక్షంలో భారరహిత స్థితిని అనుభవించిన కారణంగా భూవాతావరణానికి వారి శరీరాలు అలవాటుపడేందుకు వీలుగా ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వారం రోజుల పాటు ఇస్రోకు చెందిన వైద్యాధికారులు వ్యోమగాముల ఆరోగ్యం, ఫిట్‌నెస్‌ను నిరంతరం పర్యవేక్షిస్తారని అన్నారు. అంతరిక్షం నుంచి భూమికి బయల్దేరే ముందు కూడా వారికి పలు ఆరోగ్య పరీక్షలను నిర్వహిస్తారన్నారు. క్వారంటైన్‌లో ఉన్న వారం రోజుల్లో అంతరిక్ష యాత్ర వల్ల వ్యోమగాముల శరీరాలపై పడిన ప్రభావాన్ని వైద్యాధికారులు అధ్యయనం చేస్తారని తెలిపారు. వారి శరీరంలో రక్త ప్రవాహం, హృదయనాళాలు, మెదడు పనితీరును అంతరిక్ష యాత్ర ఎలా ప్రభావితం చేసిందనే విషయాలను పరిశీలిస్తారన్నారు. యాక్సియం–4 మిషన్‌లో భాగంగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్) వెళ్లిన భారత వ్యోమగామి శుభాంశు శుక్లా, మరో ముగ్గురు వ్యోమగాములు ఈనెల 14న భూమికి తిరిగి రానున్నట్లు అంతరిక్ష పరిశోధన సంస్థ– నాసా వెల్లడించింది. యాక్సియం–4 మిషన్ ద్వారా శుభాంశుతో పాటు పెగ్గీ విట్సన్, స్లావోస్జ్ ఉజ్నాన్స్‌కీ–విస్నియెస్కీ, టిబర్ కపు ఫ్లోరిడాలోని కెన్నడీ అంతరిక్ష కేంద్రం నుంచి గతనెల 25న నింగిలోకి దూసుకెళ్లారు. 28 గంటల ప్రయాణం తర్వాత వారు ఐఎస్ఎస్‌లో ప్రవేశించారు. దాదాపు రెండు వారాలుగా ఐఎస్ఎస్‌లో ఉన్న శుభాంశు శుక్లా.. ఏకంగా 96.5 లక్షల కిలోమీటర్ల దూరం ప్రయాణించినట్లు యాక్సియం స్పేస్ వెల్లడించింది. వ్యోమగాములు ఇప్పటివరకు దాదాపు 230 సార్లు భూమిని చుట్టి వచ్చారని పేర్కొంది.




# వీసా వస్తే సరిపోదు..

### 'బహిష్కరణ ముప్పు'పై అమెరికా వార్నింగ్

**యూఎస్ :** అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు చేపట్టిన నాటినుంచి వలసదారులపై కఠిన వైఖరి అనుసరిస్తున్నారు. ఇప్పటికే వీసాల జారీకి 'సోషల్ మీడియా వెట్టింగ్'ను తప్పనిసరి చేసిన సంగతి తెలిసిందే. అయితే, వీసా పొందిన తర్వాత కూడా నిబంధనలు పాటించకపోతే 'బహిష్కరణ ముప్పు' తప్పదని అగ్రరాజ్యం తాజాగా హెచ్చరించింది. ఈ మేరకు భారత్‌లోని యూఎస్ రాయబార కార్యాలయం 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేసింది. "వీసా మంజూరుతోనే వలసదారులపై స్క్రీనింగ్ ఆగిపోదు. వారి ప్రతి కదలికను నిశితంగా గమనిస్తూనే ఉంటాం. అమెరికా చట్టాలు, ఇమిగ్రేషన్ నిబంధనలను వీసాదారులు తప్పనిసరిగా పాటించాల్సిందే. వాటిని అతిక్రమిస్తే మాత్రం తక్షణం వీసాలను రద్దు చేసి దేశం నుంచి వెళ్లగొడతాం" అని ఎంబసీ తమ పోస్ట్‌లో స్పష్టంచేసింది. వీసా దరఖాస్తుదారులు తప్పనిసరిగా తమ ఐదేళ్ల సోషల్ మీడియా ఖాతాలను సమర్పించాల్సి ఉంటుందని ఇటీవల అమెరికా వెల్లడించిన సంగతి తెలిసిందే. ఫేస్‌బుక్, లింక్డిన్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలనూ, అందులో అభ్యర్థులు చేసిన పోస్టులు, కామెంట్లు, వెల్లడించిన అభిప్రాయాలనూ అగ్రరాజ్య అధికారులు పరిశీలిస్తారు. అలా అని వాటిలో ఉన్న పోస్టులు ఏవీ ఇప్పుడు డిలీట్ చేయడానికి వీల్లేదు. ఒకవేళ అలా చేసినట్టు కనిపిస్తే పరిశీలన మరింత లోతుగా వెళ్లి తనిఖీ చేసే అవకాశం ఉంటుంది. ఈ వివరాలను ఇవ్వకపోతే వీసా తిరస్కరిస్తారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకమైన ఆలోచనలు ఉన్నట్టు కనిపించిన వ్యక్తులను దేశంలోకి రాకుండా చూడటం కోసం ఈ 'సోషల్ మీడియా వెట్టింగ్'ను అగ్రరాజ్యం తీసుకొచ్చినట్లు తెలుస్తోంది.



# 600 డ్రోన్లతో.. ఉక్రెయిన్ రక్షణ వ్యవస్థలను ధ్వంసం చేసిన రష్యా

**రష్యా :** ఉక్రెయిన్‌పై రష్యా భారీ స్థాయిలో దాడులు కొనసాగిస్తోంది. తాజాగా కీవ్‌లోని ఆయుధ పరిశ్రమలపై మాస్కో 600 డ్రోన్లు, క్షిపణులతో వైమానిక దాడులకు పాల్పడింది. ఉక్రెయిన్‌కు చెందిన ఆర్మీ రిక్రూట్‌మెంట్ కేంద్రాలు, సైనిక వైమానిక స్థావరాలపైనా దాడులు నిర్వహించినట్లు రష్యా రక్షణశాఖ వెల్లడించింది. ఈ దాడుల్లో పలువురు ప్రాణాలు కోల్పోగా.. నివాస భవనాలు, మౌలిక సదుపాయాలు, విశ్వవిద్యాలయాలు దెబ్బతిన్నాయి. పదుల సంఖ్యలో ప్రజలు గాయాలపాలయ్యారు. రష్యా ప్రయోగించిన 319 డ్రోన్‌లు, 25 క్రూజ్ క్షిపణులను నేలకూల్చినట్లు ఉక్రెయిన్ ఎయిర్ డిఫెన్స్ ఫోర్స్ వెల్లడించింది. కీవ్ చేపట్టిన ఎదురు దాడుల్లో మాస్కోలోని పలు భవనాలు ధ్వంసమయ్యాయి. తమతో జరుగుతున్న యుద్ధంలో రష్యా వాడుతున్న 40 శాతం బాలిస్టిక్ క్షిపణులు, ఫిరంగి వ్యవస్థలు ఉత్తరకొరియా నుంచే రష్యాకు అందుతున్నాయని ఉక్రెయిన్ ఆరోపించిన కొన్ని గంటల్లోనే పుతిన్ సేనలు ఈ దాడులకు పాల్పడడం గమనార్హం. పుతిన్ సేనలు కొనసాగిస్తున్న యుద్ధానికి గట్టిగా బదులు చెప్తామని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ శుక్రవారం పేర్కొన్నారు. యుద్ధం విషయంలో త్వరగా ఓ నిర్ణయానికి రావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఉక్రెయిన్‌కు తాత్కాలికంగా నిలిపివేసిన కొన్ని ఆయుధాల సరఫరాను తిరిగి ప్రారంభించినట్లు అమెరికా అధికారులు తెలిపారు.

# తొలి ఇన్నింగ్స్‌లో స్కోర్లు సమం

## భారత్ 387 ఆలౌట్
## రాహుల్ శతకం
## రాణించిన జడేజా, పంత్



**లండన్:** ఇంగ్లాండ్‌తో మూడో టెస్టులో ఆధిక్యం కోసం టీమ్‌ఇండియా గట్టిగానే ప్రయత్నించినా ఆశ నెరవేరలేదు. తొలి ఇన్నింగ్స్‌లో సరిగ్గా ప్రత్యర్థి స్కోరు వద్దే భారత్ కూడా ఆలౌటైపోయింది. 145/3తో మూడో రోజు, శనివారం ఇన్నింగ్స్‌ను కొనసాగించిన టీమ్‌ఇండియా.. 387 పరుగులు చేసింది. నిలకడను కొనసాగిస్తూ ఓపెనర్ కేఎల్ రాహుల్ (100, 177 బంతుల్లో 13(4)) సెంచరీ సాధించాడు. రిషబ్ పంత్ (74, 112 బంతుల్లో 8(4), 2(6)), రవీంద్ర జడేజా (72, 131 బంతుల్లో 8(4), 1(6)) విలువైన ఇన్నింగ్స్ ఆడారు. ఇంగ్లిష్ బౌలర్లలో క్రిస్ వోక్స్ (3/84), జోఫ్రా ఆర్చర్ (2/52), బెన్ స్టోక్స్ (2/63) రాణించారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన ఇంగ్లాండ్ ఒక ఓవర్లో వికెట్ నష్టపోకుండా 2 పరుగులు చేసింది. క్రాలీ (2), డకెట్ (0) క్రీజులో ఉన్నారు. ఆదివారం ఇంగ్లాండ్‌ను ఎంత త్వరగా భారత్ ఆలౌట్ చేస్తుందన్న దానిపై విజయావకాశాలు ఆధారపడి ఉంటాయి.

### పట్టు చిక్కినట్లే చిక్కి..

శనివారం 145/3తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన భారత్.. తొలి సెషన్లో తిరుగులేని ఆధిపత్యం చలాయించింది. లంచ్ లోపు ఆట చూస్తే భారత్‌కు మ్యాచ్‌పై పట్టు చిక్కినట్లే కనిపించింది. మ్యాచ్ ఫలితాన్ని శాసించే స్థాయిలో ఆధిక్యం సంపాదించడం ఖాయమనించింది. కానీ తొలి టెస్టులో మాదిరే కీలక దశలో చకచకా వికెట్లు కోల్పోయి మంచి అవకాశాన్ని కోల్పోయింది భారత్. ఉదయం రాహుల్, పంత్.. తర్వాత జడేజా, సుందర్ కీలక భాగస్వామ్యాలతో జట్టును మంచి స్థితికి చేర్చినా.. ఈ రెండు దశల్లో వికెట్లు కోల్పోయిన భారత్ పట్టు కోల్పోయింది. ఉదయం రాహుల్ (ఓవర్‌నైట్ 53), పంత్ (ఓవర్‌నైట్ 19) నిలకడగా ఆడుతూ జట్టును పటిష్ట స్థితికి చేర్చారు. ఓ ఎండ్‌లో రాహుల్ ఆచితూచి ఆడుతుంటే.. మరో ఎండ్‌లో పంత్ తనదైన శైలిలో షాట్లు కొట్టాడు. కొన్ని ఓవర్ల తర్వాత రాహుల్ సైతం జోరు పెంచాడు. దీంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. 22 ఓవర్లలోనే వందకు పైగా పరుగులు సాధించింది భారత్. తొలి సెషన్ చివరికి రాహుల్ 98 పరుగులపై నిలవగా.. పంత్ 74 పరుగులకు చేరుకున్నాడు. కొన్ని నిమిషాల్లో లంచ్ అనగా.. భారత్ 248/3తో పటిష్ట స్థితికి చేరుకుంది. కానీ సెషన్ చివర్లో పంత్ అనవసరంగా రనౌటైపోవడంతో భారత్‌కు ఒకింత నిరాశ తప్పలేదు. విరామానంతరం సెంచరీ పూర్తి చేసిన వెంటనే రాహుల్ ఔటైపోవడం మరో షాక్. ఈ స్థితిలో జడేజా, నితీశ్ కుమార్ రెడ్డి (30) ఓపిగ్గా బ్యాటింగ్ చేసి మళ్లీ ఇన్నింగ్స్‌ను గాడిన పెట్టే ప్రయత్నం చేశారు. ఈ జోడీ ఆరో వికెట్‌కు 72 పరుగులు జోడించడంతో భారత్ తిరిగి మెరుగైన స్థితికి చేరుకుంది.

నితీశ్‌ను స్టోక్స్ ఔట్ చేసినా.. సుందర్ (23)తో కలిసి జడేజా మరో విలువైన భాగస్వామ్యం నెలకొల్పడంతో భారత్ 376/6తో ఆధిక్యం దిశగా అడుగులేసింది. ఆ దశలో ఆధిక్యం కనీసం 70-80 ఖాయమనే అనిపించింది. కానీ ఈ స్థితి నుంచి భారత్ అనూహ్యంగా కుప్పకూలింది. జడేజా వికెట్ పడిందో లేదో.. ఇన్నింగ్స్ పేకమేడను తలపించింది. రెండుసార్లు అంపైర్ ఎల్బీ ఇచ్చినా సమీక్షలో బతికిపోయిన ఆకాశ్ దీప్ (7) తర్వాత ఎంతోసేపు నిలవలేదు. 2 వికెట్లు చేతిలో ఉండగా, ఇంగ్లాండ్ స్కోరును భారత్ సమం చేయగా.. స్వల్ప ఆధిక్యమైనా దక్కుతుందనిపించింది. కానీ ఇంగ్లాండ్ బౌలర్లు అదే స్కోరు వద్ద బుమ్రా (0), సుందర్‌లను ఔట్ చేసి ఇన్నింగ్స్‌కు తెరదించారు.



## జీవితంలో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియదు
### భారత బౌలర్ మహ్మద్ సిరాజ్

లార్డ్స్ టెస్టులో ఇంగ్లాండ్ మొదటి ఇన్నింగ్స్‌లో భారత బౌలర్ మహ్మద్ సిరాజ్ రెండు వికెట్లు తీశాడు. ఈసందర్భంగా పోర్చుగల్ ఫుట్‌బాల్ ఆటగాడు డియోగో జోటాకు అంకితమిస్తున్నట్లు హావభావాలు ప్రదర్శించిన సంగతి తెలిసిందే. దానిపై ఇప్పటికే సిరాజ్ స్పందించాడు. దానికి కారణాలేంటో తాజాగా బీసీసీఐ షేర్ చేసిన ఓ వీడియోలో వెల్లడించాడు. "గత మ్యాచ్ సమయంలో డియోగో జోటా రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు విడిచినట్లు తెలిసింది. నేను పోర్చుగల్ జట్టు అభిమానిని. అక్కడ క్రిస్టియానో రొనాల్డో ఉన్నాడు. దీంతో నేను కాస్త భావోద్వేగానికి గురయ్యా. జీవితం అంచనాలకు అందనిది. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియదు. చాలా వాటి గురించి ఫైట్ చేస్తాం. కానీ, రేపు ఏమవుతుందో ఎవరికీ తెలియదు. లైఫ్‌కు ఎప్పుడూ గ్యారంటీ ఉండదు. నేను రోడ్డు ప్రమాదం గురించి వినగానే షాక్‌కు గురయ్యా. దీంతో లార్డ్స్‌లో వికెట్లు తీసిన తర్వాత అలా అంకితం ఇచ్చా" అని వీడియోలో సిరాజ్ పేర్కొన్నాడు. జులై 3న జరిగిన రోడ్డు ప్రమాదంలో డియోగోతో పాటు అతడి సోదరుడు కూడా ప్రాణాలు కోల్పోయారు.




## 'అనతికాలంలో ధనవంతుడు అవ్వడమెలా?'
### చాట్‌జీపీటీ అదిరిపోయే రిప్లయ్

ధనవంతుడవ్వాలని ఈ సమాజంలో చాలా మందికి ఉంటుంది. నిత్యం ఆర్థిక సమస్యలు, అప్పుల బాధలు అనుభవించేకంటే.. ధనవంతుడైపోతే జీవితంలో ఉన్న కష్టాలన్నీ ఒకేసారి దాటేయ వచ్చున్నది వారి భావన. డబ్బున్న వారికున్న కష్టాలు వారికీ ఉంటాయి. ఆ స్థాయికి చేరడానికి వాళ్లకెన్నేళ్లు పట్టిందనేది మాత్రం ఆలోచించరు. ఈ క్రమంలో నలుగురిలో 'రిచ్' అనిపించుకోవడానికి నిచ్చెన మెట్లు త్వరగా ఎక్కేయాలని కొందరు ఉబలాటపడుతుంటారు. ఈ విషయంపై ఓపెన్‌ఏఐకి చెందిన చాట్‌జీపీటీ ఇచ్చిన సమాధానం మాత్రం అద్భుతమనే చెప్పాలి. తక్కువ కాలంలో డబ్బు సంపాదనకు ఉన్న మార్గాలేంటని అడిగినప్పుడు.. దానికి సమాధానం చెప్తూనే, చివర్లో ఇచ్చిన సమాధానం మాత్రం ఆలోచింపజేస్తోంది. ఇంతకీ ఏమని సమాధానం ఇచ్చిందో తెలుసా?

- తక్కువ కాలంలో డబ్బు సంపాదనకు ఉన్న మార్గాలేంటని చాట్‌జీపీటీని అడిగినప్పుడు ఆ చాట్‌బాట్ ఈవిధంగా సమాధానం ఇచ్చింది..
- మార్కెట్‌లో డిమాండ్ ఉన్నటువంటి డిజిటల్ మార్కెటింగ్, వెబ్ డెవలప్‌మెంట్, డేటా అనలిటిక్స్, వీడియో ఎడిటింగ్ వంటి స్కిల్స్‌ను నేర్చుకోవాలి.
- చాట్‌జీపీటీ, కాన్వా, మిడ్‌జర్నీ వంటి ఏఐ టూల్స్‌పై పట్టు సాధించడం ద్వారా నెలకు రూ.1 లక్ష వరకు సంపాదించొచ్చు. ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలుగా ఇవి ఉపయోగపడతాయి.
- ఆన్‌లైన్ ఫ్రీలాన్సింగ్, బ్లాగింగ్, అఫ్లియేట్ మార్కెటింగ్‌బీ యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌లో కంటెంట్ క్రియేషన్, డిజిటల్ ఉత్పత్తుల అమ్మకం వల్ల కూడా ఆదాయం సమకూరుతుంది.
- సిప్, స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు, పీపీఎఫ్, రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడులు కూడా మిమ్మల్ని ధనవంతులుగా మారుస్తాయి.
- టెక్, ఫైనాన్స్ వంటి అంశాలపై యూట్యూబ్ వీడియోలు, ఇన్‌స్టా రీల్స్ చేయడం ద్వారా కూడా ఆదాయం సంపాదించొచ్చు.
- లింక్డిన్ వంటి నెట్‌వర్కింగ్ ప్లాట్‌ఫామ్స్‌లో యాక్టివ్‌గా ఉండండి. నిపుణుల నుంచి కొత్త విషయాలు నేర్చుకోండి. ఈవెంట్లు, సెమినార్లకు హాజరవ్వండి. పాజిటివ్ మైండ్‌సెట్ కలిగిన వ్యక్తులతో పరిచయాలను పెంచుకోండి.
- నో షార్ట్‌కట్స్: ధనవంతులు అవ్వడం కోసం లాటరీ, గ్యాంబ్లింగ్, అధిక రిటర్నులు ఇస్తాయని ఆశచూపే పథకాల జోలికెళ్లొద్దు. ఇలాంటివి మీ జీవితాన్ని మరింత రిస్క్‌లో పడేస్తాయంటూ చాట్‌జీపీటీ ఇచ్చిన సమాధానం ఆలోచింపజేస్తోంది.

## మీ టీవీ ఇక కంప్యూటర్‌గా..
### జియో నుంచి మరో సంచలనం




రిలయన్స్ ఇండస్ట్రీస్ డిజిటల్ విభాగమైన జియో ప్లాట్‌ఫాం మరో వినూత్న ఆలోచనతో ముందుకొచ్చింది. సెట్-టాప్ బాక్స్ సాయంతో టీవీని డెస్క్‌టాప్‌గా వినియోగించుకునేలా క్లౌడ్ ఆధారిత వర్చువల్ డెస్క్‌టాప్ సేవలను ప్రారంభించింది. జియోపీసీ పేరిట దీన్ని లాంచ్ చేసింది. రిలయన్స్ జియో బ్రాడ్‌బ్యాండ్ వినియోగదారులకు ఉచితంగా ఈ సేవలను అందిస్తోంది. ఫ్రీ ట్రయల్ కూడా ఇన్విటేషన్ ప్రాతిపదికన అందిస్తున్నారు. విడిగా కావాలంటే రూ.5,499కి కొనుగోలు చేయొచ్చు. ఈ పీసీని వినియోగించాలంటే జియో సెట్-టాప్ బాక్స్‌తో పాటు కీబోర్డ్, మౌస్ ఉంటే చాలు.. మీ టీవీ స్క్రీన్‌ను వర్చువల్ డెస్క్‌టాప్‌ను మార్చుకోవచ్చు. జియో సెట్-టాప్ బాక్స్‌ను టీవీకి కనెక్ట్ చేశాక.. జియోపీసీ యాప్‌ను లాంచ్ చేయాలి. తర్వాత మౌస్, కీబోర్డు కనెక్ట్ చేయాలి. జియో పీసీ అకౌంట్‌ను సెటప్ చేయాలి. ఆపై లాంచ్‌నౌ క్లిక్ చేయగానే జియో పీసీ సేవలు అందుబాటులోకి వస్తాయి. ఎడ్యుకేషన్, ఆన్‌లైన్ క్లాసులు, ఇతరత్రా అవసరాలకు వినియోగించుకోవచ్చు. ప్రస్తుతానికి కెమెరాలు, ప్రింటర్లు వంటి వాటిని అనుసంధానం చేసే వెసులుబాటు లేదు. జియోపీసీ అధికారిక వెబ్‌సైట్ ప్రకారం.. ఇందులో ఓపెన్ సోర్స్ లైబ్రే ఆఫీస్ ప్రీఇన్‌స్టాల్ అయి ఉంటుంది. మైక్రోసాఫ్ట్ ఆఫీస్ యాప్‌లు వాడాలంటే బ్రౌజర్ ద్వారా విడిగా యాక్సెస్ చేసుకోవాలి. ఇది బ్రౌజింగ్‌కు, యాప్‌లను ఉపయోగించడానికి, ఎడ్యుకేషనల్ టూల్స్, ఆన్‌లైన్ తరగతులకు అనువుగా ఉంటుందని వెబ్‌సైట్‌లో పేర్కొన్నారు. క్లౌడ్‌లో నిర్వహించడం వల్ల అప్‌గ్రేడ్ చేయాల్సిన అవసరం కూడా ఉండదని కంపెనీ తెలిపింది. స్థిరమైన ఇంటర్నెట్ కనెక్టివిటీ ఉంటే చాలు. క్లౌడ్ ఆధారిత పీసీని తయారు చేస్తున్నాయని జియో ఇన్ఫోకామ్ ఛైర్మన్ ఆకాశ్ అంబానీ ఈ ఏడాది మార్చిలోనే తెలిపారు. ఇందులో భాగంగా తాజాగా జియో క్లౌడ్‌పీసీని లాంచ్ చేశారు. మరిన్ని వివరాలకు కంపెనీ వెబ్‌సైట్‌ను సందర్శించండి.

## భారత్‌లోని యూజర్లకు 'ఎక్స్' గుడ్ న్యూస్
### ప్రీమియం సబ్‌స్క్రిప్షన్‌పై భారీ తగ్గింపు



ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన సామాజిక మాధ్యమం 'ఎక్స్' భారత్‌లోని యూజర్లకు గుడ్ న్యూస్ చెప్పింది. దేశంలో ఎక్కువమంది యూజర్లకు చేరువయ్యేందుకు ప్రీమియం సబ్‌స్క్రిప్షన్‌ను భారీగా 48 శాతం తగ్గిస్తున్నట్లు తన నిర్ణయాన్ని ప్రకటించింది. భారత్‌లోని యూజర్లకు ప్రీమియం సబ్‌స్క్రిప్షన్ కోసం ఇప్పటివరకు నెలకు రూ.900 వసూలు చేయగా.. దానిని రూ.470కి తగ్గించింది. ప్రీమియం సబ్‌స్క్రిప్షన్‌ను తీసుకున్న వినియోగదారులు బ్లూటిక్ పొందడం సహా సుదీర్ఘ పోస్టులు చేసుకోవడానికి సంస్థ వీలు కల్పిస్తోంది. వెబ్ మోడ్‌లో ఎక్స్‌ను వినియోగించే వారికి ప్రీమియం సబ్‌స్క్రిప్షన్ కూడా ఇప్పుడు రూ.650 నుంచి నెలకు రూ.427కి తగ్గించింది. నెలవారీ బేసిక్ సబ్‌స్క్రిప్షన్ ఛార్జీలను రూ.243.75 నుంచి రూ.170కి దాదాపు 30 శాతం తగ్గించింది. బేసిక్ వినియోగదారుల వార్షిక సబ్‌స్క్రిప్షన్‌లను కూడా రూ.2,590.48 నుంచి రూ.1,700 తగ్గించినట్లు ఎక్స్ వెల్లడించింది. తన ప్లాట్‌ఫామ్ ఆదాయాన్ని పెంచుకొనేందుకు 'ఎక్స్' 2023 అక్టోబర్‌లో తొలిసారి ప్రీమియం ప్లస్ సబ్‌స్క్రిప్షన్ తీసుకొచ్చింది. యాడ్- ఫ్రీ ఎక్స్‌పీరియన్స్, సుదీర్ఘ ఆర్టికల్స్ రాసే సౌలభ్యం, సూపర్‌గ్రోక్, గ్రోక్ 4 వంటి ఫీచర్ వంటి ప్రత్యేక యాక్సెస్‌ను ఇది వినియోగదారులకు అందిస్తోంది. ఈ ప్లాన్‌ను కూడా తాజాగా రూ.3,470 నుంచి రూ.2,570కి తగ్గించినట్లు ఎక్స్ వెల్లడించింది. మొబైల్‌లో ప్రీమియం ప్లస్ ప్లాన్‌ను వినియోగించే వారికి గతంలో నెలకు రూ.5,100 ఖర్చు అవుతుండగా.. ప్రస్తుత తగ్గింపుతో కేవలం రూ.3,000లకే అందుబాటులోకి వస్తోంది.



## టాటా విద్యుత్ కార్లపై డిస్కౌంట్
### హారియర్ ఈవీపై లక్ష వరకు తగ్గింపు

ప్రముఖ కార్ల తయారీ సంస్థ టాటా మోటార్స్ తన ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ మోడళ్లపై డిస్కౌంట్ ప్రకటించింది. జూన్‌లో కంపెనీ ప్యాసింజర్ వాహనాల అమ్మకాలు 37,083 యూనిట్లుగా నమోదయ్యాయి. గతేడాది ఇదే నెలలో 43,527 యూనిట్లతో పోలిస్తే విక్రయాల్లో 15 శాతం తగ్గుదల కనిపించింది. ఈ నేపథ్యంలో అమ్మకాలను పెంచుకునేందుకు ఆఫర్లను ప్రకటించింది. హారియర్ ఈవీపై అత్యధికంగా రూ.లక్ష వరకు డిస్కౌంట్ అందిస్తోంది. అయితే, ఈ పరిమితకాలపు ఆఫర్ కేవలం ఎంపిక చేసిన వేరియంట్‌లపై, కొన్ని నగరాల్లోనే అందుబాటులో ఉంది. టాటా వాహన యజమానులకు లాయల్టీ ప్రయోజనాలు లభిస్తాయి.

టాటా టియాగో ఈవీ లాంగ్ రేంజ్ వేరియంట్‌పై మొత్తం రూ.40 వేల వరకు డిస్కౌంట్ పొందొచ్చు. వినియోగదారులు తమ పాత కారును అమ్మే సమయంలో రూ.20 వేలు క్యాష్ డిస్కౌంట్, రూ.20 వేలు ఎక్స్ఛేంజ్ బోనస్‌గా పొందొచ్చు. కంపెనీ టాటా పంచ్ ఈవీపైనా ఇదే తరహా డీల్‌ను అందిస్తోంది. రూ.20 వేలు క్యాష్ డిస్కౌంట్, రూ.20 వేలు ఎక్స్ఛేంజ్ బోనస్ అందిస్తోంది. అలాగే, దేశంలో అత్యంత ప్రజాదరణ పొందిన ఈవీల్లో ఒకటైన టాటా నెక్సాన్ ఈవీపైనా రూ. 30 వేల ఎక్స్ఛేంజ్ బోనస్ అందిస్తోంది. అదనంగా లాయల్టీ ప్రయోజనాలు, 6 నెలల పాటు టాటా పవర్ చార్జింగ్ స్టేషన్లలో వెయ్యి యూనిట్ల ఉచిత ఛార్జింగ్‌ను అందిస్తోంది. టాటా కర్వ్ ఈవీపై కొనుగోలుదారులు రూ.50 వేల వరకు ఎక్స్ఛేంజ్ బోనస్‌తో పాటు లాయల్టీ రివార్డు పొందొచ్చు. అలాగే మొదటి వెయ్యి మంది కస్టమర్లకు టాటా పవర్ ఛార్జింగ్ స్టేషన్లలో 6 నెలల పాటు ఉచిత ఛార్జింగ్ సదుపాయం కల్పిస్తోంది. మరిన్ని వివరాలకు దగ్గర్లోని టాటా షోరూమ్‌ను సంప్రదించండి.




## అవెన్యూ సూపర్‌మార్ట్స్ లాభం రూ.773 కోట్లు

**దిల్లీ:** డిమార్ట్ బ్రాండ్‌పై సూపర్‌మార్కెట్లను నిర్వహిస్తున్న అవెన్యూ సూపర్‌మార్ట్స్ లిమిటెడ్, జూన్ త్రైమాసికంలో రూ.772.81 కోట్ల ఏకీకృత నికరలాభాన్ని నమోదు చేసింది. 2024-25 జూన్ త్రైమాసిక లాభం రూ.773.68 కోట్లతో పోలిస్తే, ఈసారి అతి స్వల్పంగా తగ్గింది. ఇదే సమయంలో కార్యకలాపాల ఆదాయం మాత్రం రూ.14,069.14 కోట్ల నుంచి రూ.16,359.7 కోట్లకు పెరిగింది. ఇదే కాలంలో వ్యయాలు కూడా రూ.13,056.61 కోట్ల నుంచి రూ.15,321.66 కోట్లకు పెరగడం వల్లే, ఈసారి లాభాలపై ప్రభావం చూపిందని సంస్థ వివరించింది.

Printed, published and owned by **VELLENKI JAYAPAL REDDY**, printed at **M/s KAKATIYA PRINTERS**, H-No: 24-91/72/1, Block No. 29, Plot Nos 72, 73 and 74, Lakshminarayana Nagar IDA Uppal, Uppal Mandal, Medchal-Malkajgiri Dist, Telangana-39, Published at H-No: 3-125/92/86, Anaghapuri Colony, Boduppal, Medipally Mandal, Medchal-Malkajgiri Dist, Telangana- 92, Editor: **VELLENKI JAYAPAL REDDY**, Cell No: **9346984911, 9133445456**, RNI NO: TELTEL/2023/84471, website: www.nedudailynews.com, e-mail: vellenkijayapalreddy@gmail.com